Follow: @ANNTELUGU
ANN తెలుగు
30-06-2025
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 206 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రామచంద్రుడా? రాజేంద్రుడా?

**ఉత్కంఠగా మారిన బీజేపీ అధ్యక్ష పదవి**

ఈటల వైపు అధిష్ఠానం, రాంచందర్ రావు వైపు ఆర్ఎస్ఎస్

**హైదరాబాద్, మహా :** దాదాపు ఏడాది పాటు వాయిదా పడుతూ వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఉత్కంఠతకు తెరపడనుంది. అధ్యక్ష ఎన్నికకు పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం నామినేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టడంతో కొత్త అధ్యక్షుడు ఎవరన్న అంశంపై కాషాయ దళంలో ఉత్కంఠ నెలకొంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్లు భేష్

- ఆదివాసీ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు
- మూడు నెలల్లో 40 వేల శానిటరీ నాప్కిన్ల తయారు
- లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని కితాబు
- దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తి అంటూ కామెంట్
- మన్ కీ బాత్ 123వ ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ


02



### ఆపరేషన్ కగార్ ఆపకపోతే నువ్వు ఖతమే

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- మళ్ళీ ఫోన్ చేసి బెదరించిన మావోయిస్టులు


02



### బైక్ కొంటే రెండు హెల్మెట్లు

- కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్
- రేపటి నుంచే అమల్లోకి భద్రతా నిబంధనలు

03





### మహా న్యూస్‌పై నిరసన మాత్రమే..

- మేము దాడి చేస్తే అలా ఉండదు
- మీడియా ముసుగులో ఇష్టం వచ్చిన బూతులు మాట్లాడొద్దు
- ఎక్కడ దాక్కున్నా పట్టుకొని మీ పని చెప్తాం
- రెచ్చిపోయిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

వివరాలు 2లో



### జూబ్లీహిల్స్‌లో విజయం మాదే

- జీహెచ్ఎంసీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- జీహెచ్ఎంసీ మేయర్ స్థానం కైవసం చేసుకోవాలి
- జులై 4న ఖర్గే సభను విజయవంతం చేద్దాం
- బీజేపీ, బీఆర్ఎస్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ
- హైదరాబాద్ కాంగ్రెస్ నేతల సమావేశంలో మంత్రి పొన్నం

వివరాలు 2లో



# దేశంలో నక్సలిజం లేకుండా చేస్తాం


## ఆపరేషన్ కగార్ ఆగదు

ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాల్సిందే

అప్పటి వరకు మావోయిస్టుల వేట కొనసాగుతుంది

నిజామాబాద్ లో పసుపు బోర్డును ప్రారంభించిన అమిత్ షా

బీఆర్ఎస్ కు కాళేశ్వరం ఏటీఎం.. కాంగ్రెస్ కు తెలంగాణ ఏటీఎం



**నిజామాబాద్, మహా :** ఉగ్రవాదాన్ని మాత్రమే కాకుండా దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యమని , . ఆపరేషన్ కగార్ ఆగదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆదివారం అమిత్ షా ప్రారంభించారు. అనంతర ఏర్పాటు చేసిన కిసాన్ సభలో పాల్గొన్న ఆయన ఆపరేషన్ కగార్ ఆపేది లేదన్నారు. మావోయిస్టులు హత్యాకాండ వదిలి రావాలని సూచించారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని తెలిపారు. లేదంటే మావోయిస్టుల వేట కొనసాగిస్తూనే ఉంటామని, 2026 మార్చ్ 31

మిగతా 2లో

# కాంగ్రెస్ జోరు

## 17 పార్లమెంట్ లకు ఇన్ ఛార్జ్ ల నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

పార్టీ బలోపేతం దిశగా కాంగ్రెస్ కీలక ముందడుగు

ఆదిలాబాద్‌కు ఎంపీ రఘువీర్.. పెద్దపల్లికి గాలి అనిల్..

జహీరాబాద్ కు బండి రమేష్ సికింద్రాబాద్ కు ఝాన్సీరెడ్డి

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై ఫోకస్ పెట్టింది. రాష్ట్ర కమిటీని నియామకం చేసి పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇన్ ఛార్జీలను ఖరారుచేసింది. ఆదిలాబాద్ కు నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, పెద్దపల్లికి గాలి అనిల్ కుమార్ , సికింద్రాబాద్ కు ఝాన్సీరెడ్డి, జహీరాబాద్ కు బండి రమేష్ ను ఇన్ ఛార్జిలుగా నియమించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇంచార్జ్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీలను నియమించారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. ఒక్కో పార్లమెంట్ స్థానానికి ఒక వైస్ ప్రెసిడెంట్, ముగ్గురు జనరల్ సెక్రటరీల నియమించారు.

మిగతా 2లో



### పసుపు బోర్డుపై హైడ్రామా

**కేంద్ర బడ్జెట్‌లో బోర్డుకు నయా పైసా లేదు**



- పేరుకు రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి ?
- ఆర్ఆర్ ట్యాక్స్ పై చర్యలెందుకు ఉండవు
- సీబీఐ, ఈడీ విచారణకు ఏం అడ్డు వస్తోంది
- అమిత్ షాకు మాజీ మంత్రి కేటీఆర్ కౌంటర్

02

2026 ఏప్రిల్ నుంచి మొదటి దశ

## జనాభా లెక్కలు మొదలు

**భారత జనాభా లెక్కల కమిషనర్ ఎంకె నారాయణ్**

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ

దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన

30 ప్రశ్నలను సిద్ధం చేసిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ, మహా :** జనాభా లెక్కల కోసం గృహాల గుర్తింపు (హౌస్ లిస్టింగ్) కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఇది జనాభా లెక్కల మొదటి దశ ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. పర్యవేక్షకులు, గణకుల నియామకాలు రాష్ట్రాలు, జిల్లా పరిపాలన సహకారంతో జరుగుతుందని వెల్లడించారు.

మిగతా 2లో



### పూర్ణచందర్ కు 14 రోజుల రిమాండ్


- చంచల్ గూడ జైలుకు తరలింపు
- పూర్ణ చందర్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

03



### మెడికోలకు గుడ్ న్యూస్

- 15 శాతం స్టైఫండ్ పెంచిన సర్కార్
- మెడికల్, డెంటల్ విద్యార్థులకు పెంపు వర్తింపు



03

### కాంగ్రెస్ నేత రావి శ్రీనివాస్‌కు షాక్

**అధిష్ఠానం సస్పెన్షన్ వేటు**

- ఆరేళ్లపాటు విధించిన హైకమాండ్
- మంత్రి సీతక్కపై విమర్శలతో చర్యలు
- రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని రావి శ్రీనివాస్ తాజా వ్యాఖ్య

02



### ఫోన్ ట్యాపింగ్ పై కేంద్రం కీలక నిర్ణయం

ఇక పై కేంద్రం అనుమతి ఉంటేనే రాష్ట్రాల్లో ట్యాపింగ్ చెయ్యాలి

గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

వివరాలు 3లో




# ఆపరేషన్ కగార్ ఆగదు

## ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాల్సిందే

### అప్పటి వరకు మావోయిస్టుల వేట కొనసాగుతుంది

### నిజామాబాద్ లో పసుపు బోర్డును ప్రారంభించిన అమిత్ షా

### బీఆర్ఎస్ కు కాళేశ్వరం ఏటీఎం.. కాంగ్రెస్ కు తెలంగాణ ఏటీఎం

(మొదటిపేజీ తరువాయి)

వరకు మావోయిస్ట్ ముక్త్ భారత్ ను స్థాపించి తీరుతాం అన్నారు. అణాయక గిరిజనులు, ఆదివాసీలను చంపేస్తున్న మావోయిస్టులను వదిలి వేయాలా చెప్పాలని సభికులను ఉద్దేశించి అమిత్ షా అడిగారు, పోలీసులను కూడా మావోయిస్టులు చంపేస్తున్నారని పేర్కొన్నారు. హింసకు పాల్పడుతూ, ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్న మావోయిస్టులతో చర్చలు జరపలేమని తేల్చి చెప్పారు. ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ కు గట్టి బుద్ధి చెప్పామని పేర్కొన్న అమిత్ షా.. రాహుల్ గాంధీ నోట పాకిస్తాన్ జపం ఉంటుందని ఎద్దేవా చేశారు. ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉగ్రవాదుల ఆటలు కట్టించారన్నారు. మన దేశం వైపు ఉగ్రవాదులు చూడాలంటే భయం రేకెత్తించేలా చర్యలు తీసుకున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేశంలో ఉగ్రదాడులు తరచూ జరిగేవని, ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. పహల్గాం దాడి తర్వాత పాక్ పై భారత్ ప్రతీకారం తీర్చుకుందన్నారు. తెలంగాణలో బీజేపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయం అని తెలుస్తోందన్నారు. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండని అక్కడ ఉన్న సభికుల్ని ఉద్దేశించి అమిత్‌షా అన్నారు. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కోరారు.

**తెలంగాణ పసుపు రైతుల కల నెరవేరింది**

తెలంగాణ పసుపు రైతులు నాలుగు దశాబ్దాలుగా కంటున్న కలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిజం చేసిందని అమిత్ షా అన్నారు. తెలంగాణ రైతుల అభ్యున్నతికి, పసుపు రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. నిజామాబాద్ పసుపు పంటకు ప్రపంచ మార్కెట్లో గొప్ప పేరుందని, దాని ప్రాధాన్యతను మరింత పెంచాల్సిన అవసరం ఉందని అమిత్ షా అభిప్రాయపడ్డారు. పసుపు కేవలం ఒక పంట కాదని, యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ క్యాన్సర్ గుణాలున్న ఒక దివ్య ఔషధమని ఆయన కొనియాడారు. 2030 సంవత్సరం నాటికి ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) విలువైన పసుపు ఉత్పత్తులను భారతదేశం నుంచి ఎగుమతి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ బోర్డు ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ అందిస్తామని, తద్వారా దిగుబడి, నాణ్యత పెంచేందుకు తోడ్పడతామని అమిత్ షా వివరించారు.

**పసుపు కేవలం పంట కాదు, ఒక దివ్య ఔషధం**

పసుపు ప్రాముఖ్యతను కేవలం వాణిజ్య పంటగా కాకుండా, ఔషధ గుణాలున్న ఒక దివ్య ఔషధంగా అభివర్ణించారు. పసుపులో ఉన్న యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ క్యాన్సర్ గుణాలు దానిని మానవ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా మారుస్తాయని ఆయన ప్రస్తావించారు. ఆయుర్వేదంలోనూ, ఆధునిక వైద్య పరిశోధనల్లోనూ పసుపు ప్రాధాన్యత నానాటికీ పెరుగుతోందని ఆయన వివరించారు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని, పసుపు ఉత్పత్తుల ఎగుమతులను గణనీయంగా పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2030 నాటికి 1 బిలియన్ డాలర్ల విలువైన పసుపు ఉత్పత్తులను ఎగుమతి చేయాలనే లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని రకాల ప్రోత్సాహకాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇది పసుపు రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుస్తుందని ఆయన నొక్కి చెప్పారు. పసుపు ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన జాతీయ పసుపు బోర్డు ప్రాంతీయ కార్యాలయం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని అమిత్ షా వివరించారు. ఆధునిక సాగు పద్ధతులు, మెరుగైన వంగడాలు, తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులకు శిక్షణ అందిస్తామని



తెలిపారు. దీనివల్ల దిగుబడి, నాణ్యత పెరిగి రైతులు అధిక లాభాలు గడించగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిజామాబాద్ పసుపునకు ప్రత్యేక గుర్తింపు కోసం ఇప్పటికే జియో ట్యాగింగ్ ప్రక్రియను కూడా ప్రారంభించామని వెల్లడించారు. ఇది నిజామాబాద్ పసుపుకు అంతర్జాతీయంగా ఒక బ్రాండ్‌ను సృష్టించి, దాని మార్కెట్ విలువను పెంచుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా, భారత్ కోఆపరేటివ్ సొసైటీల ద్వారా రైతులు ఆర్థికంగా మరింత ప్రయోజనం పొందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సహకార సంఘాలు రైతులకు రుణ సౌకర్యాలు, మార్కెటింగ్ మద్దతు అందించి వారిని బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

**అవినీతిలో బీఆర్ఎస్ ను కాంగ్రెస్ మించిపోయింది**

తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని అమిత్ షా దీమా వ్యక్తం చేశారు. తెలంగాణను పదేళ్ళు పాలించిన బీఆర్ఎస్ అవినీతిని పెంచి పోషించిందని, కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ ఏటీఎంగా మార్చుకుందని అమిత్ షా వ్యాఖ్యానించారు. అదే విధంగా ధరణిని అడ్డు పెట్టుకుని యదేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడిందన్నారు. టీఎస్పీఎస్సీ, అక్రమాలపై పోరాటం చేసిన బీజేపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అణిచివేయాలని ప్రయత్నించిందని మండిపడ్డారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ ఢిల్లీకి ఏటీఎం గా మారిందన్నారు. అవినీతిలో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ మించిపోతోందని వ్యాఖ్యానించారు. అవినీతి రహిత పాలన కావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందేనని పేర్కొన్నారు. తెలంగాణను నక్సల్స్ కు అడ్డాగా చేయొద్దని రేవంత్ సర్కార్ కు అమిత్ షా సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ కేతిరెడ్డి గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టం తెలంగాణ పసుపు రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని అందరూ ఆకాంక్షించారు.

## పసుపు రాజధాని నిజామాబాద్

పసుపు పంటకు నిజామాబాద్ ఒక రాజధాని లాంటిది. అలాంటి చోట నా చేతుల మీదుగా పసుపు బోర్డును ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నాను అని అమిత్ షా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణకు పసుపు బోర్డును సాధించడం కోసం బీజేపీ ఎంపీలు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. వారి పోరాట ఫలితంగానే బోర్డును ఏర్పాటు చేయడమే కాకుండా, దానికి ఛైర్మన్‌గా తెలంగాణకు చెందిన వ్యక్తినే నియమించామని ఆయన తెలిపారు. ఈ ప్రాంత పసుపును దేశీయంగానే కాకుండా, అంతర్జాతీయంగానూ విస్తృత పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, వారికి మెరుగైన మద్దతు ధర లభించేలా చూడటంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పునరుద్ఘాటించారు. తద్వారా పసుపు సాగును మరింత లాభదాయకంగా మార్చవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


# మహా న్యూస్‌పై నిరసన మాత్రమే..

## మేము దాడి చేస్తే అలా ఉండదు

### మీడియా ముసుగులో ఇష్టం వచ్చిన బూతులు మాట్లాడొద్దు

### ఎక్కడ దాక్కున్నా పట్టుకొని మీ పని చెప్తాం: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**సూర్యాపేట, మహా:** మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియా ముసుగులో కొంతమంది స్లాటర్ హౌస్‌లు నడుపుతున్నారని వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ వ్యక్తిత్వాలను హననం చేసే దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. మీడియా ముసుగులో దాడి చేస్తే కేసీఆర్ అభిమానులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మీ దాడులకు తాము ప్రతి దాడులు చేస్తే తట్టుకోలేరని చెప్పారు. సూర్యాటపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీడియా ముసుగులో ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్‌లపై అసత్య ప్రచారాలు చేస్తున్నదని కాంగ్రెస్ పైమండిపడ్డారు. ఏడాదిన్నరగా మీడియాని అడ్డం పెట్టుకుని కేసీఆర్‌పై కుట్రలు చేస్తూన్నరని చెప్పారు. తమను ఇబ్బంది పెట్టే వారిని ఎవ్వరినీ వదిలిపెట్టేది లేదని, చంద్రబాబు , రేవంత్‌ను చూసి మురుస్తున్న వారిని భవిష్యత్తులో ఎవ్వరూ కాపాడలేరని స్పష్టం చేశారు. పథకం ప్రకారమే బీఆర్ఎస్‌పై దుర్మార్గానికి పాల్పడుతున్నారని చెప్పారు. మీడియా కేంద్రాల ముసుగులో కబేళాలు (స్లాటర్ హౌస్‌లు) నడుపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణాను ఆంధ్ర నుంచి విడదీశారనే అక్కసుతోనే కేసీఆర్‌పై కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు.



ఎక్కడ దాక్కున్నా పట్టుకొని..

తమ పిటిషన్లపై ప్రేక్షక పాత్రపోషించే పోలీసులు.. తమపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. 'రాజకీయ పార్టీలుగా మేమూ మేమూ తేల్చుకుంటాం. మీడియా అసత్య ప్రచారాలెందుకు. ప్రాణాలకు తెగించి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ పైనా మీ ప్రేలాపనలు. ఉద్యమం నుంచి వచ్చినోళ్లం కేసులకు భయపడతామా. మహా న్యూస్‌పై దాడి చేశారని మొసలి కన్నీరు కారుస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై అక్కసుతో అదేపనిగా పెట్టుకొని దాడులు చేస్తున్నారు. నిన్న జరిగింది దాడి కాదు.. నిరసన మాత్రమే. మా సహనానికి పరీక్ష పెట్టొద్దు. మీడియా ముసుగులో మీ ఇష్టం వచ్చిన బూతులు మాట్లాడితే ఎవరు ఊరుకుంటారు. బిన్ లాడెన్ లాగా ఎక్కడ దాక్కున్నా పట్టుకొని మీపని చెప్తాం' అంటూ వ్యాఖ్యానించారు.

# భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్లు భేష్

## ఆదివాసీ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు

- మూడు నెలల్లో 40 వేల శానిటరీ నాప్కిన్ల తయారు
- లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని కితాబు
- దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తి అంటూ కామెంట్
- మన్ కీ బాత్ 123వ ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా:** మన్ కీ బాత్ 123వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. మిల్లెట్ బిస్కెట్లు తయారు చేస్తున్న తెలంగాణలోని భద్రాచలం ప్రాంత మహిళలను ఆయన అభినందించారు. భద్రాచలంలోని ఆదివాసి మహిళలు 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్' పేరిట బిస్కెట్లు తయారు చేస్తున్నారని.. అవి హైదరాబాద్ నుంచి లండన్‌కు కూడా ఎగుమతి అవుతున్నాయని వెల్లడించారు. అంతేకాకుండా ఈ మహిళలే మూడు నెలల్లో 40,000 శానిటరీ నాప్కిన్లను తయారు చేసి విక్రయించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. భారత జనాభాలో 64 శాతం కన్నా ఎక్కువ మంది దాదాపు 95 కోట్లమంది ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని ప్రధాని మోదీ వివరించారు. 2015లో సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్ల మందికి అందేవని గుర్తుచేశారు. శాశ్వత అంధత్వానికి దారితీసే ట్రాకోమా వ్యాధి నుంచి భారత్ పూర్తిగా విముక్తి పొందినట్లు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో నిర్ధరించిందని 123వ మన్‌కీబాత్



ఎపిసోడ్‌లో మోదీ తెలిపారు.

**ట్రకోమా రహిత దేశంగా భారత్..**

చాలాకాలం తర్వాత అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైందన్న ప్రధాని మోదీ, యాత్రికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తవడాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించిన ప్రధాని, ఎమర్జెన్సీపై పోరాడిన బాబూ జగ్జీవన్ రామ్ వంటి వారిని మనం స్మరించుకోవాలనీ అది రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. అలాగే 1971 ఎమర్జెన్సీ పరిస్థితి గురించి మాట్లాడుతూ.. ఆ యుగం ఎలా ఉండేదో మీరు ఊహించలేరని ప్రధాని అన్నారు. అత్యవసర పరిస్థితి విధించిన వారు మన రాజ్యాంగాన్ని హత్య చేయడమే కాకుండా న్యాయవ్యవస్థను కూడా తమ బానిసగా ఉంచుకోవాలని అనుకున్నారని ఆరోపించారు. అత్యవసర పరిస్థితి సమయంలో ప్రజలు చాలా బాధలు పడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిని ప్రస్తావిస్తూ, ఇది ఎప్పటికీ మరచిపోలేని చీకటి సత్యమని ప్రధాని మోదీ అన్నారు. ఆ సమయంలో దేశ తొలి కాంగ్రెసేతర ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ చేసిన ప్రసంగం క్లిప్‌ను ఆయన పంచుకున్నారు.

# కాంగ్రెస్ జోరు

## 17 పార్లమెంట్ లకు ఇన్ ఛార్జ్ ల నియామకం

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు.

**పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఉపాధ్యక్షులు**

ఆదిలాబాద్ - ఎంపీ రఘువీర్ రెడ్డి
పెద్దపల్లి - గాలి అనిల్ కుమార్
కరీంనగర్ - ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
నిజామాబాద్ - ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్.
జహీరాబాద్ - బండి రమేష్.
మెదక్ - నవాబ్ ముజాహిదీన్ ఆలం ఖాన్.
మల్కాజ్ గిరి - ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య.
సికింద్రాబాద్ - ఝాన్సీ రెడ్డి.
హైదరాబాద్ - సంగమేశ్వర్.
చేవెళ్ల - బొంతు రామ్మోహన్.
నాగర్ కర్నూల్ - కొండేటి మల్లయ్య.
నల్గొండ - మామిండ్ల శ్రీనివాస్.
భువనగిరి - కోటింరెడ్డి వినయ్ రెడ్డి.
వరంగల్ - సత్యనారాయణ.
మహబూబాబాద్ - నాగేశ్వర్ రావు.
ఖమ్మం - శ్రవణ్ కుమార్ రెడ్డి.
మహబూబ్ నగర్ - వేణు గౌడ్

# జూబ్లీహిల్స్‌లో విజయం మాదే

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. విజయం కాంగ్రెస్ పార్టీదే అని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఇప్పటి నుండి గ్రౌండ్ లెవెల్‌లో ప్రణాళిక ద్వారా ముందుకు పోవాలని సూచించారు. ఇదే సమయంలో జీహెచ్ఎంసీ ఎన్నికలకు కూడా ఇప్పటి నుండి సన్నద్ధం కావాలి అని అన్నారు. ఆదివారం హైదరాబాద్ కాంగ్రెస్ నేతల సమీక్షా సమావేశం జరిగింది.

**కష్టపడుతున్న వారికి నామినేటెడ్ పోస్టులు..**

ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..'జూలై నాలుగో తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌లో పర్యటిస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేయాలి. హైదరాబాద్‌లో ఉన్న అన్ని నియోజకవర్గాల నుండి ముఖ్య నేతలు సభలో పాల్గొనాలి. సభ ఏర్పాట్లపై నేతలు, కార్యకర్తలు యాక్టివ్‌గా ఉండాలి. హైదరాబాద్‌లో పార్టీకి సంబంధించిన ఇష్యూనా దృష్టికి వచ్చాయి. దేవాలయ కమిటీలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ, బోనాల చెక్కుల పంపిణీ తదితర ప్రోటోకాల్ సమస్యలపై చర్చించడం జరిగింది. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న వారికి నామినేటెడ్ పోస్టులు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుండి సన్నద్ధం కావాలి. జీహెచ్ఎంసీ మేయర్ స్థానం కాంగ్రెస్ కైవసం చేసుకోవాలి. జూబ్లీహిల్స్ ఉప



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తుంది. ప్రభుత్వ సంక్షేమమే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది' అని వ్యాఖ్యలు చేశారు.

**ఆ రెండు పార్టీలు దోస్తులు..**

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీలాగా వ్యవహరిస్తున్నాయని మంత్రి పొన్నం అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం మీరు ఏం చేశారని, బాధ్యతారహితంగా వ్యహరించినందుకు మీకు ప్రజలు సున్నా సీట్లు ఇచ్చారని విమర్శించారు. రాబోయే కాలంలో మిమ్మల్ని ప్రజలు కనుమరుగు చేస్తారని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష బాధ్యతలు వదిలి.. శత్రుదేశంగా సొంత రాష్ట్రానికి నష్టం కలిగేలా చేస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రంలో రాష్ట్రానికి ఏమైనా సమస్య వస్తే అన్నీ పార్టీలు కలిసి వస్తాయన్నారు. తెలంగాణలో కూడా ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు.

# రామచంద్రుడా? రాజేంద్రుడా?

## ఉత్కంఠగా మారిన బీజేపీ అధ్యక్ష పదవి

### ఈటల వైపు అధిష్టానం, రాంచందర్ రావు వైపు ఆర్ఎస్ఎస్



(మొదటిపేజీ తరువాయి)

పార్టీ అధ్యక్ష పీఠం కోసం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావులతో పాటు మరికొంత మంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీని గెలిపిస్తే బీసీని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతామని పార్టీ అధిష్టానం ప్రకటించింది. అయితే ఆ ఎన్నికల్లో బీజేపీ కేవలం ఎనిమిది స్థానాలను దక్కించుకుంది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని బీసీ వర్గానికి చెందిన నేతకే కట్టబెట్టవచ్చన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇదే నిర్ణయాన్ని అధిష్టానం అమలు చేస్తే ఈటల రాజేందర్ కు కానీ, ధర్మపురి అరవింద్ కు కానీ దక్కే అవకాశాలున్నాయి. కానీ ఆర్ఎస్ఎస్ నాయకత్వం మాత్రం పార్టీకి మొదటి నుంచి వీరవిధేయుడిగా పని చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు వైపు మొగ్గు చూపుతోంది. ఈటల రాజేందర్ వైపు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జోరుగుతోంది. ఒకవేళ ఏపీలో మాదిరిగా మహిళకు అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టాలని అధిష్టానం నిర్ణయిస్తే మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు ఛాన్స్ ఉంటుందన్న ప్రచారం ఉంది. అయితే ఈటల, రాంచందర్ రావు అభ్యర్థిత్వాలను అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ పట్టు నిలుపుకుటుందా లేక అధిష్టానం తన నిర్ణయాన్ని అమలు చేస్తుందా అనేది సాయంత్రంలోగా స్పష్టం కానుంది. నామినేషన్ల ప్రక్రియ సాయంత్రం గం. 2 నుంచి 4 గంటల వరకు ఉండగా, ఉప సంహరణకు సాయంత్రం గం. 5 వరకు ఉంది. అయితే మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎవరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారనేది అధిష్టానం నుంచి సంకేతాలు వస్తాయని ఆ తర్వాత నామినేషన్ దాఖలు చేయనున్నారు.

## కాంగ్రెస్ నేత రావి శ్రీనివాస్‌కు షాక్

**ఆసిఫాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌కు పార్టీ షాక్ ఇచ్చింది. ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ప్రకటించింది. రావి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టీపీసీసీ క్రమశిక్షణ చర్య కమిటీ (డీఏసీ) ఛైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ నియమావళిని అనుసరించి చర్యలుంటాయని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. రావి శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

**సస్పెన్షన్‌పై ఆయన స్పందిస్తూ..**

అయితే ఈ సస్పెన్షన్ పై రావి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. అయితే ఈ సస్పెన్షన్ పై రావి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారు. తనను సస్పెండ్ చేస్తారని ముందుగానే ఊహించానని తెలిపారు. సీతక్క ఇచ్చిన ఫిర్యాదుతో తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో దీనికి తప్పకుండా రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని, అందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

# రైతుల కోసమా.. రాజకీయాల కోసమా?

## ప్రసంగంలో పసుపు ధర ఊసే లేదు.. అమిత్ షా పర్యటన పై వేముల ఫైర్

**నిజామాబాద్, మహా:** ముందే ప్రారంభించిన పసుపు బోర్డు తాత్కాలిక కార్యాలయాన్ని మరో భవనంలోకి మార్చి కేంద్రమంత్రి అమిత్‌షా మళ్లీ ప్రారంభించారని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అద్దె భవంతిలో రెండోసారి ప్రారంభోత్సవం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమిత్‌షా నిజామాబాద్ పర్యటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. పసుపు రైతులు మద్దతు ధర కావాలనే కోరుతుంటే.. తాత్కాలిక భవంతులు రెండు సార్లు ప్రారంభించి ఏమారుస్తున్నారని మండిపడ్డారు. సభ పసుపు రైతుల కోసం కానీ, అమిత్‌షా రాజకీయాల గురించి మాట్లాడారని విమర్శించారు. బీజేపీ ఫెలయిన ఆపరేషన్ సిందూర్, బీఆర్ఎస్, నక్సలైట్ల అంశాలపై మాట్లాడారని చెప్పారు. కేంద్రమంత్రి ప్రసంగంలో పసుపు మద్దతు ధర, బోర్డు నిధులు, శాశ్వత కార్యాలయం ఊసే లేదన్నారు.

# ఆపరేషన్ కగార్ ఆపకపోతే నువ్వు ఖతమే

### ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు

### మళ్ళీ పోన్ చేసి బెదరించిన మావోయిస్టులు

**హైదరాబాద్, మహా :** కాలికి శస్త్ర చికిత్స అనంతరం ఆస్పత్రిలో కోలుకుటున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు మరోసారి బెదరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆదివారం ఉదయం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు రఘునందన్ రావుకు ఫోన్ చేసి ఈ రోజ నిన్న ఖతం చేస్తాం, ఆపరేషన్ కగార్ ను ఆపితే సరే సరి లేకపోతే అంతే సంగతులు అని బెదరించారు. దీంతో మరోసారి రఘునందన్ రావు తనకు వచ్చిన పోన్ కాల్స్ వివరాలను రఘునందన్ రావు పోలీసులకు తెలిపారు. ఈ నెల 23న మొదటి బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో తెలంగాణ డీజీపీతో పాటు సంగారెడ్డి, మెదక్ ఎస్పీలకు ఫిర్యాదు చేయడంతో కాల్స్ పై విచారణ జరిపి ఆర్మడ్ సిబ్బందితో ఎస్కార్ట్ వాహనాన్ని రక్షణగా కల్పించారు, రెండు రోజుల క్రితం యశోద హాస్పిటల్ లో కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీ రఘునందన్ రావుకు మళ్ళీ బెదిరింపులు కాల్స్ మొదలయ్యాయి, 9489556347, 7365035440 రెండు వేరు వేరు నెంబర్స్ నుండి బెదిరింపులు మొదలయ్యాయి, ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు మిమల్ని చంపడానికి 5 బృందాలు రంగంలోకి దిగాయని, మా ఫోన్స్ ట్రేస్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని, తమ సమాచారం దొరకదని, తాము ఇంటర్నెట్ కాల్స్ వాడుతున్నామని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని బెదిరించడం జరిగింది. రఘునందన్ రావు హాస్పిటల్ నుండే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది.

# పసుపు బోర్డుపై హైడ్రామా

## కేంద్ర బడ్జెట్ లో బోర్డుకు నయా పైసా లేదు

- పేరుకు రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి ?
- ఆర్ఆర్ ట్యాక్స్ పై చర్యలెందుకు ఉండవు
- సీబీఐ, ఈడీ విచారణకు ఏం అడ్డు వస్తోంది
- అమిత్ షాకు మాజీ మంత్రి కేటీఆర్ కౌంటర్

**హైదరాబాద్, మహా:** నిజామాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు ఏటీఎంగా మారిందని చెప్పే అమిత్ షా, ఆ ఆరోపణలపై విచారణకు ఎందుకు ఆదేశించటం లేదని ప్రశ్నించారు. 'దేశ అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ ఉన్నాయి కదా? అవినీతిపై విచారణ జరిపించడానికి ఏం అడ్డొస్తుంది? ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీకి కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ. ఇదే కమ్మక్కు రాజకీయాలతో రేవంత్ వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా?' అంటూ కేటీఆర్ విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్ రెడ్డిని బీజేపీ పావుగా వాడుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

**అవి మోదీ చేసిన వ్యాఖ్యలే..**

దేశ ప్రధాని మోదీ గతంలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కలిసి 'ఆర్ఆర్ టాక్స్' పేరిట ప్రజాధనాన్ని దోచు



కుంటున్నారని స్వయంగా ఆరోపించారు. కానీ దర్యాప్తుకు మాత్రం ఇప్పటివరకు ఆదేశించలేదు. ఎందుకు?'' అని సూటిగా ప్రశ్నించారు. అదే సమయంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చి సీఎం రేవంత్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంగా చర్యలు తీసుకోవడంలో విఫలమవడం పై విరుచుకుపడ్డారు. 'పట్టపగలే ప్రజల సొమ్మును లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్నట్టు మీరు చెబుతున్నారంటే, ఆ అక్రమాలను అడ్డుకునే బాధ్యత కేంద్రానికి లేదు అనుకోవాలా? మాటలకే పరిమితం కాక, చర్యలెందుకు ఉండవు?' అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఇన్నిసార్లు ప్రారంభించడం సబబేనా?..**

పసుపు బోర్డు విషయంలో కేంద్రం తీరుపైనా ఆయన మండిపడ్డారు. ''ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నయా పైసా కేటాయించకుండా.. పేరుకు పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి ? కనీసం సొంత భవనం కూడా కట్టకుండా.. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ గారు నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించడం సమంజసమేనా ?'' అని ప్రశ్నించారు. అసలు ఒక్క పసుపు బోర్డును ఇన్నిసార్లు ప్రారంభించడం సబబేనా?.. ఈ జనవరి 14న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్ లో ఢిల్లీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్‌గోయల్ వర్చువల్ గా పసుపు బోర్డును ప్రారంభించేశారు.

# గోల్కొండలో బోనాల సందడి

## అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

- పోతురాజుల విన్యాసాలతో కోలాహలం
- జులై 1 న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల సందడి మొదలైంది. చారిత్రాత్మక గోల్కొండ కోటలో బోనాల సమర్పణ ప్రారంభమయ్యాయి. దీంతో ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు గోల్కొండకు చేరుకుని ముక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా గోల్కొండ కోట పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గోల్కొండ బోనాల జాతర ఘనంగా కొనసాగుతోంది. రెండో పూజ ఆదివారం కావడంతో గోల్కొండ కోటకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో గోల్కొండ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

**బోనాల జాతర మొదలు..**

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో గోల్కొండలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈ నెల 26వ తేదీ గురువారం నుంచి ఆషాడ మాస బోనాల ఉత్సవాలు మొదలయ్యాయి. గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలిబోనం సమర్పించడంతో బోనాల జాతర మొదలైంది. ప్రతి గురు, ఆదివారాల్లో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నారు. అమ్మవార్లకు 9 పూజలతో గోల్కొండ బోనాలు జరుగుతాయి. గోల్కొండ కోటలో నెలరోజుల పాటు బోనాల ఉత్సవాలు జరగనున్నాయి. గోల్కొండ కోటాలో మొదలైన బోనాలు జులై 24న తిరిగి గోల్కొండ కోటలో వేడుకలు ముగియనున్నాయి.

**లష్కర్ బోనాల జాతరకు అంకురార్పణ..**

కాగా తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరకు ఆదివారం అంకురార్పణ జరగనుంది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ బోనాల జాతరలో తొలి ఘట్టమైన అమ్మవారి ఘటం ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి, ఆలయ ఫ్యామిలీ ట్రస్టు చైర్మన్ సురిటి రామేశ్వర్, కామేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి ఆభరణాలను అప్పగించడం ద్వారా ఘటం ఎదుర్కోలు ప్రారంభమవుతుందన్నారు. వచ్చే నెల 13వ తేదీన బోనాలు జరుగుతాయని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు చేస్తారని వారు తెలిపారు. 14న ఉదయం 8.30 గంటలకు రంగం (భవిష్యవాణి) కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

## 2026 ఏప్రిల్ నుంచి మొదటి దశ

# జనాభా లెక్కలు మొదలు

(మొదటిపేజీ తరువాయి)

జనాభా లెక్కింపు కార్యక్రమం రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో గణకులు ఇంటింటికి వెళ్లి గృహాల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో ప్రతి ఇంటి గృహ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం సేకరిస్తారు. ఆ తర్వాత రెండో దశలో ఇంటింటికి వెళ్లి జన గణన చేపడతారు. ప్రతి ఇంట్లోని జనాభా, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలను తీసుకుంటారు. ఇది 2027 ఫిబ్రవరి 1 నాటికి జరగనుంది.

**జనగణన కోసం 34 లక్షల గణకులు**

జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటనలో తెలిపింది. జనగణన కార్యకలాపాల కోసం 34 లక్షలకు పైగా గణకులు, పర్యవేక్షకులు, సుమారు 1.3 లక్షల జనాభా గణన కార్యకర్తలను నియమించనున్నారు. మరికొద్ది రోజుల్లో చేపట్టనున్నది 16వ జనాభా గణన. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎనిమిదవది. రాబోయే జనాభా గణనను మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి డిజిటల్ విధానంలో నిర్వహిస్తారు. డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతో పాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్పీజీ/పీఎన్జీ కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.



జనగణన నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీఎస్‌లకు భారత జనాభా లెక్కల కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. జనాభా లెక్కల ప్రక్రియకు తుది తేదీగా పరిగణించే ఈ ఏడాది డిసెంబర్ 31కి ముందు పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అందులో కోరారు. జనగణన కోసం అన్ని గ్రామాలు, పట్టణాలను ఏకరీతి గణన బ్లాక్‌లుగా విభజించామని పేర్కొన్నారు. జనగణన సమయంలో ఎటువంటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతి బ్లాక్‌కు ఒక గణకుడిని నియమిస్తామని వెల్లడించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్లు, సూపర్ వైజర్లు, గణకుల నియామకం, వారి మధ్య పని విభజన జరుగుతుందని మృత్యుంజయ్ కుమార్ తెలిపారు. 2027 ఫిబ్రవరి 1 నాటికి జనగణన ప్రారంభమవుతుందని వెల్లడించారు. డిసెంబర్ 31 లోపు మున్సిపల్ కార్పొరేషన్లు, రెవెన్యూ గ్రామాలు, సబ్ డివిజన్లు, జిల్లాల సరిహద్దుల్లో ఏవైనా ప్రతిపాదిత మార్పులు చేయాలని అన్ని విభాగాలను ఆదేశించాలని అన్ని రాష్ట్రాల సీఎస్‌లను కోరారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. ఆఖరిగా 2011లో జనాభా లెక్కలు సేకరించారు. ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2021లో నిర్వహించాల్సిన జనగణన నిలిచిపోయింది. తాజాగా 16వ జనగణనకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

# ఫోన్ ట్యాపింగ్ పై కేంద్రం కీలక నిర్ణయం

- ఇక పై కేంద్రం అనుమతి ఉంటేనే రాష్ట్రాల్లో ట్యాపింగ్ చెయ్యాలి
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్రం అనుమతులు లేకుండా ఫోన్ ట్యాపింగ్ చేయకుండా నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఈ మేరకు ఆదేశాలు కూడా జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు 30 రోజుల్లో అమల్లోకి రానున్నాయి. రానున్న కొత్త ప్రతిపాదనలు. రాష్ట్రాల్లో ఫోన్ ట్యాపింగ్ అధికారాలపై పరిమితులు ఉంటాయి. ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్‌లు ట్యాప్ చేయాలంటే ఇక పై కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. ట్యాపింగ్ అధికారం ఆయా రాష్ట్రాల వరకే పరిమితం .కేంద్ర హోంశాఖ అనుమతి ఉంటేనే ఇతర రాష్ట్రాల్లోని వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ చేసే ఛాన్స్.

# సీఎం వ్యాఖ్యలు అవగాహన రాహిత్యం

## మెట్రో డీపీఆర్ వారం క్రితమే అందింది

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ విషయంలో కేంద్రం సహకరించడం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. రేవంత్ వ్యాఖ్యలు అవగాహనా రాహిత్యంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఆదివారం ప్రధాన మంతరి మన్ కీ బాత్ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి మెట్రో డీపీఆర్ కేవలం వారం రోజుల క్రితమే కేంద్రానికి అందిందన్నారు. డీపీఆర్ సాధ్యాసాధ్యాలపై కేంద్రం పరిశీలిస్తుందని చెప్పారు. ఇంతలోనే ఏదో జరిగిపోయిందన్నట్లు రేవంత్ రెడ్డి కేంద్రం సహకరించడం లేదని మాట్లాడటం సరికాదన్నారు. ఏదైనా కేంద్ర ప్రభుత్వం ఒక పథకానికి నిధులు ఇవ్వాలనుకున్నప్పుడు సదరు ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర రిపోర్టును అధ్యయనం చేయడం సహజమన్నారు. మెట్రోపై ఇప్పటికే కేంద్ర మంత్రిని తాను కలిశానని, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. గతంలోనూ ఇదే తరహాలో మెట్రోపై కేంద్రం సహకరించడం లేదని ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడారని, తొందరపాటు వద్దన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి బీజేపీ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని, ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కేంద్రం మంజూరు చేసిన అనేక నిధులకు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన నిధులను విడుదల చేయాల్సిన అవసరం ఉందని, ముందుగా పెండింగ్ లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ నిధులను వెంటనే విడుదల చేసే అంశంపై సీఎం దృష్టి పెట్టాలన్నారు.

# పూర్ణచందర్‌కు 14 రోజుల రిమాండ్

## చంచల్ గూడ జైలుకు తరలింపు

### పూర్ణ చందర్ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు



**హైదరాబాద్, మహా:** యాంకర్ స్వేచ్ఛ మృతి కేసులో అరెస్టయిన ఆమె ప్రియుడు పూర్ణ చందర్‌ను పోలీసులు జడ్జి ముందు హాజరుపరిచారు. కోర్టు పూర్ణ చందర్‌కు రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలోనే పూర్ణ చందర్ కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఇచ్చాడు. ఆ స్టేట్‌మెంట్‌లో జోగినిపల్లి సంతోష్ రావు పేరు చెప్పినట్లు తెలుస్తోంది. తనకు సంబంధించిన అన్ని విషయాలు సంతోష్ రావుకు తెలుసని పూర్ణ చందర్ చెప్పాడు. భర్తతో విడాకులు తీసుకోమని స్వేచ్ఛకు చెప్పింది కూడా అతడే.

**రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు..**

పూర్ణ చందర్ మాటలు నమ్మి స్వేచ్ఛ భర్తకు విడాకులు ఇచ్చింది. భర్తతో విడాకులు తీసుకున్న తర్వాత పలు మార్లు పెళ్లి చేసుకోవాలని స్వేచ్ఛ అతడిని నిలదీసింది. అయితే, అతడు మాత్రం పెళ్లి ప్రస్తావనను దాట వేస్తూ వచ్చాడు. ఇద్దరూ వారం రోజుల క్రితం అరుణాచలం వెళ్లారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ తిరిగి వచ్చారు. అరుణాచలం నుండి తిరిగి వస్తున్న సమయంలోనే పెళ్లి విషయంపై ఇద్దరి మధ్యా మరో సారి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలోనే పెళ్లి చేసుకోనని పూర్ణ చందర్ తేల్చి చెప్పాడు. నన్నేం చేయలేవు.. నాకు రాజకీయ అండ దండలు ఉన్నాయని అతడు బెదిరించాడు. స్వేచ్ఛతో తాను రిలేషన్లో ఉన్న విషయం కూడా సంతోష్ రావుకు తెలుసని పూర్ణ చందర్ చెప్పాడు.

# దేశ చరిత్రలో అమానుష చర్య

## సినీ తారల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చింది?

- నాయకుల ఫోన్లే కాదు వారి కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్
- మీడియాపై దాడుల సంస్కృతి మంచిది కాదు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ప్రజలకు సిట్ అధికారులు అన్ని విషయాలను బహిర్గతం చేయాలని, స్వతంత్ర్య భారత దేశంలోనే ఇది అతి పెద్ద నేరమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల దాడికి గురైన మహా న్యూస్ ఛానల్ ఆఫీస్ ను ఆదివారం ఆయన సందర్శించారు. మహా న్యూస్ ఎండీ వంశీ, సిబ్బందిని అడిగి దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లుగా తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ రాజకీయ నాయకులు, అధికారుల వరకే కాకుండా సినీ తారలు, జర్నలిస్టులు, జడ్జిలు, మహిళా ఐఏఎస్ ల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారన్నారు. సినీ తారల ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఆనాటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరుగదన్నారు. వారి ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ పైన అనాటి సీఎం, మంత్రిగా ఉన్న కేసీఆర్, కేటీఆర్ లు ఎందుకు స్పందించడం లేదన్నారు.

**మీలాగ దాడులకు పాల్పడలేదు..**

రేవంత్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి వంటి నాయకులతో పాటు వారి కుటుంబ సభ్యులను ఫోన్ ట్యాపింగ్ చేశారని..వారి కుటుంబ సభ్యుల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆ హక్కును వారికి ఎవరిచ్చారన్నారు. ఈ కేసులో అన్ని వాస్తవాలు బయటకు రావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై కేసీఆర్ మౌనంగా ఎందుకు ఉంటున్నారని నిలదీశారు. పదేళ్లు సీఎంగా ఉన్న మీ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ పై కేసీఆర్ బయటకు వచ్చి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ మీడియా నిత్యం మా కాంగ్రెస్ ప్రభుత్వంపైన, నాయకులపైన అనుచిత విమర్శలు చేస్తుందని..అయినా అధికారంలో ఉండి కూడా మేం ఎక్కడా మీలాగ దాడులకు పాల్పడలేదని, పోలీస్ వ్యవస్థకు ఫిర్యాదు వరకే పరిమితమయ్యామన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన వ్యక్తి కేటీఆర్ అహంకారంతో, బెదిరింపు దోరణితో అల్లరి మూకలను రెచ్చగొట్టి భౌతిక దాడులకు పురిగొల్పడం మంచిదికాదన్నారు. మీకు ఇబ్బంది అయితే ఫిర్యాదు చేసేందుకు అనేక ప్రజాస్వామిక, రాజ్యాంగ, న్యాయ, చట్టపరమైన వేదికలున్నాయన్నారు. మీడియా సమాజంలో మంచి చెడును ప్రజలకు చెబుతుందని, మీడియాపై దాడుల సంస్కృతి మంచిది కాదని, తాము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# బైక్ కొంటే రెండు హెల్మెట్లు

## కేంద్ర ప్రభుత్వం కొత్త రూల్స్.. రేపటి నుంచే అమల్లోకి భద్రతా నిబంధనలు



**ఢిల్లీ, మహా:** ఇకపై టూ వీలర్ కొనే వారు.. కచ్చితంగా రెండు హెల్మెట్లు కొనాల్సిందే. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించి నిర్ణయం తీసుకోనుంది. వాహనం నడిపేవారికి, వెనుక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటార్ వాహనాల రూల్స్ 1989 కు పలు ముఖ్యమైన మార్పులను చెయ్యాలని కేంద్రం ప్రతిపాదించింది. కొత్త సవరణ నియమాల తుది నోటిఫికేషన్ అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మూడు నెలల్లోపు ఈ రూల్ తప్పనిసరి అవుతుందని ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది.

వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారి భద్రత కోసం కొత్త నిబంధనను కేంద్రం అమలులోకి తీసుకురానుంది. హెల్మెట్ నిబంధనతో పాటు ప్రభుత్వం మరో భద్రతా చర్యను కూడా ప్రతిపాదించింది. 2026, జనవరి 1 నుంచి 50 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం లేదా గంటకు 50 కిలోమీటర్ల వేగం దాటే మోటార్ సైకిళ్లు, స్కూటర్లు సహా అన్ని కొత్త ఎల్ 2 క్యాటగిరీ ద్విచక్ర వాహనాలకు యాంటీలాక్ బ్రేకింగ్ వ్యవస్థ (ఏబీఎస్) లను అమర్చాలని సూచనలు జారీచేసింది. వాహనానికి ఆకస్మికంగా బ్రేక్ వేసిన సమయంలో వాహనాన్ని నియంత్రించడానికి, దానితో పాటు వాహనం జారిపోయే అవకాశాలను కూడా తగ్గిస్తుంది అని నివేదికలో స్పష్టం చేశారు.

# న్యూస్ ఛానెల్‌పై దాడి

## మధుసూదనాచారి, బాల్క సుమన్‌పై కేసు నమోదు

### పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగం

**హైదరాబాద్, మహా :** న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి ఈ ఘటనపై ఛానెల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు తాజాగా మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మరికొంత మంది నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిగా పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. అయితే దాడి చేసిన తర్వాత బీఆర్ఎస్వీ నాయకులు నేరుగా తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్నారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున పోలీసులు బలగాలు తెలంగాణ భవన్ వద్దకు చేరుకున్నాయి. వారిని బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయంలోకి సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది.




# అమిత్ షా సభలో ఎన్‌సీసీ విద్యార్థుల నిరసన

**నిజామాబాద్, మహా :** నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన అమిత్ షా సభలో కొంత మంది ఎన్‌సీసీ విద్యార్థులు శాంతియుత నిరసన చేశారు. సేవ్ ఎన్‌సీసీ అంటూ భారత ఆర్మీలో, ఎన్‌సీసీలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. దీంతో వెంటనే అక్కడ ఉన్న పోలీసులు వారి ప్లకార్డులను లాగేసుకోని, విద్యార్థులను సభ నుంచి బయటకు పంపించి వేశారు. సభలో నిరసన తెలిపిన నేపథ్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

# బీజేపీ పగ్గాలు బీసీలకే ఇవ్వాలి

- బీసీ సీఎం అన్న బీజేపీ కనీసం రాష్ట్ర అధ్యక్షునిగానైనా బీసీకి అవకాశం కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



**హైదరాబాద్, మహా :** రేపో మాపో ప్రకటించబోయే తెలంగాణ రాష్ట్ర బీజేపీ సారధిగా జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకే అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ ప్రకటించి, ఎన్నికల తరువాత పార్టీ శాసనసభ పక్ష నేతగా అగ్రకులాలకు చెందిన వ్యక్తికి అవకాశం కల్పించిందన్నారు. అదే విధంగా ఇప్పటి వరకు అగ్రకుల సామాజిక వర్గ వారికే రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు అప్పచెప్పిందని, ఇప్పటికైనా రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలకు అవకాశం కల్పించి భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామనే సంకేతం బీసీలకు ఇవ్వాలని జాజుల కోరారు. చాలా రోజులుగా బీజేపీ అధ్యక్షున్నీ త్వరలోనే మారుస్తామని అదేవిధంగా బీసీని నియమిస్తామని సంకేతం ఇచ్చిందని, తీరా ఈరోజు మీడియాలో వస్తున్న వార్తలు అగ్రకులాల నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయని, ఇదే కనుక జరిగితే బీజేపీ అధికారానికి దూరం కావలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. హర్యానా రాష్ట్రంలో మూడోసారి బీజేపీ అధికారంలో రావడానికి బీజేపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ బీసీ ముఖ్యమంత్రి చేస్తామని వాగ్దానం చేసినందునే అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణలో బీసీ కులగణన జరగడం, కాంగ్రెస్ పార్టీ కూడా ఆ పార్టీ అధ్యక్షునిగా బీసీలకే అవకాశం ఇవ్వడం, ఇటీవల ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం ఇవ్వడానికి కారణం ప్రస్తుతం బీసీలలో రాజకీయ చైతన్యం రోజురోజుకు గ్రామస్థాయి వరకు పెరిగిన విషయాన్ని బీజేపీ అధిష్టానం ఆలోచించాలన్నారు, రాజకీయ సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని బీజేపీలోని బీసీ భావజాలం ఉన్న వ్యక్తికి రాష్ట్ర అధ్యక్షులుగా అవకాశం కల్పించాలని జాజు ల శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# మేకిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

- అదే మా నినాదం, లక్ష్యం... ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు
- 'ఐఐటీఈఎక్స్ – 2025' ముగింపు వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు




**హైదరాబాద్, మహా :** 'మేకిన్ ఇండియా' కాదు... 'ఇన్వెంట్ ఇన్ తెలంగాణ' అన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ నినాదం, లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివారం హైటెక్స్ లో 'ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ)' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో (ఐఐటీఈఎక్స్) - 2025' ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపీ) కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేటు (సీఎంజీఆర్) 2.9 శాతమని పేర్కొన్నారు. అదే జాతీయ సగటు 0.52 శాతం మాత్రమేనని తెలిపారు. ఆరు రేట్లు తెలంగాణలో అధికంగా నమోదయ్యిందన్నారు. 202425లో ఇండస్ట్రియల్ గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్ (జీఎస్ వీఏ) రూ.2.77 లక్షలకు చేరిందని, ఇంధన వినియోగంలో 15.6 శాతం, జీఎస్టీ వసూళ్లలో 9.8 శాతం, పే రోల్ ఎన్ రోల్ మెంట్స్ లో 13.9 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందని వివరించారు.

**ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ కేంద్రంగా ప్రత్యేక జోన్లు**

తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారని, ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ. 40వేల కోట్ల పెట్టుబడులొచ్చాయని తెలిపారు. కొత్తగా 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయని, 51వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించిందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్ ను అభివృద్ధి చేస్తున్నామని, పారిశ్రామికాభివృద్ధి వికేంద్రీకరణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని వివరించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల టెక్నాలజీ, సర్వీసెస్ జోన్, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య మ్యానుఫాక్చరింగ్ జోన్, ఆర్ఆర్ఆర్ బయట వ్యవసాయ, గ్రామీణ ఇన్నోవేషన్ జోన్ ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు.

**భవిష్యత్ తరాల కోసం మా ప్రణాళికలు**

అయిదేళ్ల కోసం మేము ప్రణాళికలు రూపొందించడం లేదని, రాబోయే తరాల కోసం ఆలోచిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2035 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యమయ్యేందుకు ముందుకొచ్చిన టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కలిసొచ్చే వారందర్నీ కలుపుకుని ముందుకెళ్తామని అన్నారు.

**జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతానికి పెరిగేలా....**

'దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)ల బలోపేతంపై మా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత 18 నెలల్లో కొత్తగా 15వేల ఎంఎస్ఎంఈలు ప్రారంభమయ్యాయి. మన జీఎస్ డీపీలో ఎంఎస్ఎంఈల వాటాను 10 శాతానికి పెంచేలానే సంకల్పంతో గతేడాది ప్రత్యేక పాలసీకి రూపకల్పన చేశాం. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. వీటిల్లో మహిళలు, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేష్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవి కుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 30-06-2025



# గుండె గొంతుక

అమ్మ తరుపుసుట్టాలు
నాయినతరుపు బంధువులు
అందరి తరుపునఇప్పుడొక స్వరం
నన్ను వాళ్లందరి గొంతుకై పలకరిస్తది!

నేను ఉత్త అమ్మే అనుకుంటాను
అది అమ్మ మాత్రమే కాదు
వేలయేండ్లతండ్లాట
బొడ్డుపేగుకొట్లాట
మా మాయిముంతల
తడి ఆరని జాగైమాట్లాడుతది!

బతికున్నోళ్లకు...
అర్ధాంతరంగా ఒడిసినోళ్లకు
మధ్యలో అమ్మే ఒక వారధి
ఊరి దు:ఖమంతా నా ముందుకు తెచ్చి
సాట్ల పోసుకొని చెరుగుతది!

ఇట్లా...
ఎనుకటియాదిని
తెగిపోతున్న రక్తసంబంధాన్ని
నీకు గుర్తు చేసే...
ఒక పచ్చిఒత్తుకుండలాంటి మనిషి–
అమ్మ

నోరుతెరిచిందా...
సిందోళ్ల కత తెల్లార్లు సాగినట్టే
మునుంబెట్టి చెప్పిందా
ఊరు ఊరంతా నీ బెడ్రూమ్లోకి వచ్చి
తలో దిక్కు కూసున్నటే!

ఈ జాతరలో తప్పిపోవడం బాగుంది

మా ఊరి బోనమైసిగమూగడంనేర్పింది
శాకపోస్తే...అమ్మే ఒక శివసత్తి
అప్రమేయ, అచేతనావస్థల్లోంచి
నా చెవుల తుప్పు ఒదులగొట్టి
నా మూలాల్ని గుర్తుచేసి
తపేల చెంబు చేతికిచ్చినట్టే!

ఇంటి ముందు
యాపకొమ్మ మీది కాకి అరుపై
వచ్చే చుట్టాలే కాదు...
కాటికి పోతున్న చుట్టాల జాడ చెప్తది
తన గుండెగొంతుకతో...

సప్పట్ల దరువులో కాముడాటో
ఒకరి తలపోత ఒకరు చెప్పుకున్నట్టే
ఆకిట్లఒకరితలలో ఒకరు పేండ్లు
చూసుకుంటే
కష్టమూ...రగిలిపొగిలేబాధో...
వాడ మీద అట్లాకూసోని
మా అవ్వలంతా...
తలపోసుకుంటే...తలకుపోసుకున్నట్టే!



-పసునూరి రవీందర్,
77026 48825



## నా లైబ్రరీ

నా పుస్తకాలు గత ఏడాది నుండి
అరల్లో అలాగే ఉన్నాయి కానీ
వాటిలోని మాటలన్నీ మరణించాయి
నాకెంతో ఇష్టమైన పుస్తకం 'స్థానభ్రంశం'
దానికోసం వెతికితే అది ఒక
డ్రాయరుసొరుగులో
ఫోటో ఆల్బమ్ కూ పాత నోకియా ఫోన్ కూ
పక్కన ఒంటరిగా కనిపించింది

పుస్తకంలోని కాయితాల మధ్య
నిక్షేపంలా ఉన్న పెన్ను లోంచి
కొన్ని సిరా చుక్కలు ఒలికాయి
కొన్ని పదాలు సిరాను శ్వాసిస్తున్నాయి
రోగుల్లాంటి కొన్నింటికి పెన్ను
వెంటిలేటర్ గా పని చేస్తోంది

**ఆ కొన్ని ఇవి:**

ఇల్లు, జెరూసలెం, సముద్రం, హైఫా నగరం
గండశిల, నారింజలు, ఇసుక, పావురం
కైరో, నా తల్లి, బేరూట్, పుస్తకాలు
గండశిల, సముద్రం, సముద్రం

ఆంగ్లమూలం: మొసాబ్ అబు తోహా
అనువాదం: ఎలనాగ

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

## 2024 కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన పంజాబీ కవయిత్రి


# పాల్ కౌర్



*అతి పెద్ద పంజాబీ కుటుంబం లో సురన్ సింగ్, సుర్జీత్ కౌర్ దంపతులకు ఐదుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు, తరువాత ఆరో అమ్మాయిగా ఎనిమిదో కాన్పులో పుట్టిందా అమ్మాయి. మళ్ళీ అమ్మాయే పుటిందని ఆగ్రహించి భార్య మొహం నెలరోజుల దాకా చూడలేదు సురన్ సింగ్. పుట్టిన పసిపాప మొహం అయితే ఆ పాప కి ఊహ వచ్చిందాకా చూడలేదు. ఉయ్యాలలో వుండే పసిపిల్లలు తండ్రి మొహాన్ని తలకు పెట్టుకునే టర్బన్ చూసి గుర్తు పడితే ఈ పసిపాప మాత్రం తండ్రి వెనుక భాగాన్ని చూసి గుర్తు పట్టేది. పాటియాలా జిల్లాలోని కలోమజ్రా గ్రామం లో మే 15 1956 న శ్వాస అందుకున్న ఆ పాప, పుడుతూనే పితృస్వామ్య వ్యవస్థ వికృత రూపాన్ని అనుభవం లోకి తెచ్చుకున్న ఆ పాప పెరిగి పెద్దయి పాల్ కౌర్ గా పంజాబ్ అక్షర ప్రపంచం లో ఒక సుస్థిర స్థానం ఏర్పరచుకుని, 2024 వచ్చేసరికి ఒక చరిత్ర సృష్టించింది.*

"సన్ గుణవంత, సన్ బుద్ధివంత, ఇతిహాసనామా పంజాబ్" పేరుతో రాసిన మూడువందల పేజీల సుదీర్ఘ దీర్ఘ కావ్యం లో ఒక సహస్రాబ్ది కాలం నాటి పంజాబ్ చరిత్రను కవితాత్మకంగా అక్షరబద్ధం చేసింది. సిక్కు చరిత్ర ప్రారంభ సంవత్సరాలలో పంజాబ్ లోని పీర్లు,ఫకీర్లు, యోగులు మొదలుకుని మహారాజా రంజిత్ సింగ్ పరిపాలన దాకా చరిత్ర ను దాని ప్రాకృతిక సౌందర్యం తో సహా దృశ్యమానం చేసిన ఆ దీర్ఘ కావ్యానికి గాను కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం 2024కు గాను ప్రకటించింది
"చర్ఖా గుండ్రంగా ధ్వనిస్తుంది,
సాధువులు వినడానికి దిగివస్తారు,
సూఫీ జోగులు మరియు పీర్ ఫకీర్లు సమావేశమవుతారు;
దర్గాలు మరియు ఖాన్కాలు ఉద్భవిస్తాయి,
పీర్ల సింహాసనాలు సమలేఖనం అవుతాయి;
ఇక్కడ వసంతం వికసిస్తుంది,
అక్కడ నవరోజ్, ఉర్స్ మేళాలలో ఖీర్ సమర్పణ;
మొహర్రం ఆలింగనంలో తాజియాలు సాగుతాయి,
ఖ్వాజాలు మరియు ఋషుల కోసం దీపాలు వెలుగుతాయి."
"అడవి కలుపు మొక్కలు ఊగుతున్న పొలాలలో,
భూమి గురునానక్ కీర్తనలను గుసగుసలాడుతుంది;
వేర్లు చరిత్ర నాడితో అల్లుకుపోతాయి,
అమరవీరుల రక్తం చిందిన చోట వికసిస్తాయి.
లాంటి బలమైన కవిత్వ వ్యక్తీకరణలు సున్ గుణవంత కావ్యం నిండా కనిపిస్తాయి
"ఈ దీర్ఘ కావ్యం పంజాబ్ చరిత్రను అన్వేషించడానికి ఆధ్యాత్మిక నదీ త్రయం లో ఒకటైన అంతర్వాహిని సరస్వతి నదిని ఒక మెటఫర్ ఉపయోగించుకున్నాను —— అన్యాయానికి వ్యతిరేకంగా చేసిన రాజీలేని పోరాటం కోసం ఒంటరితనాన్ని ధైర్యంగా ఎదుర్కొన్న భూమి మీద "వేదాంతం, బౌద్ధం, సనాతన సంప్రదాయాల నుండి నాథ్ యోగులు, ఇస్లాం మరియు సూఫిజం వరకు జరిగిన పరిణామాలను ప్రభావితం చేసిన సైద్ధాంతిక, సాంస్కృతిక ప్రభావాలను నేను అన్వేషించాను," అని పాల్ కౌర్ ఒక ఇంటర్వ్యూ లో చెప్పింది

అమృతా ప్రీతమ్ కి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చిన సంవత్సరమే పాల్ కౌర్ జన్మించింది.బహుశా అందుకేనేమో అమృతా ప్రీతమ్ పాల్ కౌర్ కి శాశ్వత ప్రేరణా శక్తి గా నిలచింది. ఆ తరువాత అమృతా ప్రీతమ్ తాను స్థాపించిన నాగమణి సాహిత్య పత్రిక లో పాల్ కౌర్ కవిత్వం చాలా ప్రచురించింది. నాగమణి ద్వారానే కౌర్ పంజాబీ సాహిత్య ప్రపంచం లో వెలుగు లోకి వచ్చింది.




పాల్ కౌర్ పంజాబీ లో విస్తృతంగా రాసిన కవిత్వం ఆంగ్లం లోకి Wild Weeds పేరుతొ అరవిందర్ కౌర్ అనువాదం చేశారు. ఆంగ్లం లో దొరుకుతున్న ఆమె కవిత్వ పుస్తకం అదొక్కటే. ఈ పుస్తకం ఒక్కటీ చదివితే చాలు కౌర్ కవిత్వ తాత్విక భూమికలు ఏమిటో చాలా తేలికగా అర్ధం అవుతాయి ఈ సంకలనం మొత్తం ఐదుభాగాలుగా వుంది. మొదటి భాగం The Tale of the Tresses. చాలా ప్రాధమికంగా ఉన్నట్టు కనిపిస్తూనే జెండర్ పాలిటిక్స్ ను బలంగా మాటలాడతాయి ఇందులోని కవితలు. జుట్టు, చెప్పులు, అక్కడక్కడ వైన్, వింటున్న పదాలనే రూపకాలుగా మార్చి పితృస్వామిక భావజాలం గురించి బలంగా చెపుతాయి. రెండవ భాగం After the Prelude ప్రేమ, నిరీక్షణ, పోగొట్టుకున్న భావన లాంటి ఉద్వేగ పూరిత అంశాలు నేపథ్యంగా స్వేచ్ఛను నిరోధించే సమాజం లో స్వేచ్ఛ కై స్త్రీ అంతరంగికంగా చేసే యుద్ధం గురించి ఈ భాగం చెపుతుంది. మూడవ భాగం The Truth of the Joined Palms లో వ్యక్తి స్వాతంత్ర్యానికి, సామాజిక, సైద్ధాంతిక కట్టుబాట్లకీ నడుమ జరిగే ఘర్షణ ప్రధానంగా ఉంటుంది. బోన్సాయి అనే కవిత చదివినప్పుడు మన అబ్బూరి ఛాయాదేవి గారు రాసిన బోన్సాయి బతుకులు గుర్తుకు వచ్చింది. నాలుగవ భాగం This Country is Mine Too పేరుకు తగ్గట్టుగానే తన పొలిటికల్ ఆక్టివిజం గురించి చెపుతుంది. ఐదవ భాగం Khublai, జ్ఞాపకాల బరువు, పోరాటాల తాత్విక నేపథ్యం లాంటి అంశాలతో నిండి ఉంటుంది

**మా పూర్వీకులు**
శరణార్థి అవమానాన్ని భరించారు, వారికి తెలియదు రెండు తరాల తర్వాతవారి వారసులు మళ్లీ ప్రశ్నార్థక చిహ్నాలుగా జీవిస్తారని. ఈ నాలుగు వాక్యాలు చాలు ఆమె ప్రతిభ ఏమిటో తెలియ చెప్పడానికి . పాల్ కౌర్ కవిత్వం చాలా వ్యక్తిగతమైనది, ఆమె అనుభవాల ఆధారంగా, రాసినవే ఈ అక్షరాలన్నీ. : "నేను కేవలం ఒక అమ్మాయిని కాబట్టి నేను తక్కువ అని గ్రహించడమే నా రచనకు ఉత్ప్రేరకంగా మారింది." అంటున్న పాల్ కౌర్ తన ధిక్కార స్వరాన్ని రూపొందించుకోవడం లో కుటుంబ, సామాజిక ఆర్థిక పరంగా చాలా కాలం పోరాటం చేయవలసి వచ్చిందని చెప్పింది. . ఆమె కవిత్వం స్వీయఆవిష్కరణ మాత్రమే కాదు, తనను తగ్గించే ప్రపంచంలో "జీవించే, శ్వాసించే మానవుడు"గా తన స్థానాన్ని పొందే మార్గం కూడా.

శిరోమణి పంజాబీ కవి అవార్డు (2002) మరియు సాహిత్య అకాడమీ అవార్డు (2024) వంటి ప్రధాన అవార్డుల గ్రహీత, కౌర్ నేటి పంజాబీ కవిత్వంలో ఒక ముఖ్యమైన స్వరం.
"సమకాలీన పంజాబీ కవిత్వంలో పాల్ కౌర్ ది ఒక ముఖ్యమైన మరియు ఆలోచనాత్మక స్వరం. ఆమె కవిత్వం పితృస్వామ్య వ్యవస్థ స్త్రీపై ప్రదర్శించే ఆధిపత్యానికి తలొగ్గకుండా తన స్వతంత్రతను నిలుపుకునే క్రమం లో మిగతా కవుల కంటే భిన్నంగా ఉంటుంది. స్థిరపడిన భావనలకు లొంగిపోకుండానే, వాటిమీద అహేతుక దాడి చేయకుండానే,వాటి నగ్న స్వరూపాన్ని కొత్తగా వివరించే ప్రయత్నం చేస్తుంది. లోపల నుంచీ, బయటనుంచీ రకరకాలుగా ఉండే వైరుధ్యాన్ని అప్రతిహతంగా ఎదుర్కొనే ధైర్యాన్ని కలిగివుంటుంది" అంటుంది నిరుపమా దత్

-వంశీకృష్ణ

## ముడి విడి వడింది

చాలా ముడులు ఉన్నాయి
నా శరీరంలోని వివిధ భాగాలలో
తలలో, మెడలో, నుదిటిలో
మణికట్టులో మరియు చీలమండలలో

ఒక చుక్క నుండి మరొక చుక్కకు
మాత్రమే పరిమితం చేయబడి ఒక రేఖ వుంది
అది ఒక బిందువు నుండి ప్రారంభమై
ఒక త్రిభుజం,ఒక చతురస్రం లేదా ఒక
దీర్ఘచతురస్రం గా
ప్రయాణించి ప్రారంభ బిందువును
కలుస్తుంది...

నేను విస్తరిస్తాననే భయంతో
మరిన్ని ముడులు వేస్తున్నాను
ముడులు విప్పేటప్పుడు మరింత బిగిస్తున్నాను
నేను ఇప్పుడా ముడులతో ముడిపడి ఉన్నాను.

చివరికి చివరి రోజు రానే వచ్చింది
భారీ ప్రయత్నంతో దంతాలతో, గోళ్ళతో
ముడులను గట్టిగా లాగి, బలవంతంగా కత్తిరించి
స్వేచ్ఛను కనుగొనే ప్రయత్నం చేశాను

లోపల భద్రంగా ఉంచినవన్నీ
చివరకు నేలపై విస్తరించి ఉన్నాయి

ప్రతిదీ శూన్యంలో తెరిచి ఉంది
నా వాటాగా నాకు ఇవ్వబడినవన్నీ
పాత్ర కాదు, ట్రంక్ కాదు
కవచం కాదు, తుపాకీ కాదు!

లోపల,ప్రతిదీ లోపల ఉంది
బయట ఉన్నట్లు కనిపించేది కూడా
బయట వ్యాపించినవన్నీ
లోపల వున్నాయి
కుదించబడిన ఘనీకృత రూపంలో

దుస్తులు తెరిచి ఉన్నాయి
జుట్టు తెరిచి ఉంది
గాలులు ప్రతిదాన్ని తమ రక్షణలోకి
తీసుకున్నాయి!


నేను ఇప్పుడు పూర్తి అడుగులు వేస్తున్నాను
నా గమ్యస్థానాలు నా అడుగుజాడలకు
చేరువలో ఉన్నాయి
ముడి చివరలు విప్పుకున్నాయి
మరియు నా రెక్కలుగా మారాయి


పాల్ కౌర్ పంజాబీ కవితకి
వివేక్ సచ్ దేవ్ - ఆంగ్ల అనువాదం
Now Ends Are Open
తెలుగు అనువాదం - వంశీకృష్ణ

## రైతు ఆత్మహత్యల ఆత్మ గోస తీతువు పిట్ట

రైతుగా నాగలి పట్టి పొలం దున్ని,రైతుల సాధక బాధలు తెలిసిన కవులు కొందరే ఉంటారు. అలాంటి అరుదైన కవి తిర్మల్ .ఉద్యమాల రైతుగా, కవితా ఉద్యమాలలో సామాజిక స్పృహతో రైతు కవిత్వాన్ని రచించిన కవి . రైతు కుటుంబం నుంచి వచ్చిన తిర్మల్ కు రైతు కుటుంబాల స్థితి గతుల పై, రైతు సమస్యల పట్ల ఎరుక వున్న అవగాహన తో రచనా వ్యాసంగం చేశారు. తిర్మల్ వృత్తి ఉపాధ్యాడు గా పదవీ విరమణ చేశారు. అలాగే సాహిత్య రంగంలో ప్రజారస వ్యవస్థాపక జిల్లా కార్యదర్శి గా,విరసం, తెరవే సంఘాలలో క్రియాశీలక పాత్ర పోషించారు.ప్రధానంగా కవిత్వం, కథలు, అనేక విద్య, విజ్ఞాన, రాజకీయ వ్యాసాలు రాశారు.

80వ దశకం లో రైతాంగ సామాజిక ఉద్యమాల లో రాటుతేలిన ప్రగతిశీల భావాలతో పల్లె జీవితాన్ని, నగర జీవితాల సామాజిక సంబంధాల అధ్యయనం తో ఇప్పటిదాకా ధిక్కార స్వరం, యుద్ధం, తీతువు పిట్ట మొదలగు కవితా సంపుటాలను వెలవరించారు. 'ప్రజా సంకృతి' పేర సాహిత్య పత్రికకు సంపాదకుడి గా ప్రచురణ కర్తగా కొన సాగారు.
ఇవేకాక ఖమ్మం జిల్లా కు చెందిన హీరాలాల్ మోరియా జీవిత చరిత్రను రాయటమే కాక పుస్తకంగా ప్రచురించారు, తొలి సినీ గేయ కవి చందాల కేశవదాస్ జీవిత చరిత్ర గ్రంధస్థం చేశారు.
90 వ దశకంలో వచ్చిన గ్లోబ్లైజషన్, సరళీ కరణ ఆర్థిక విధానం ప్రభావం అన్నీ రంగాలతో పాటు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై పడిన ప్రభావంతో రైతు ఆర్థికంగా చితికి పోవడం జరిగింది. ఆరుగాలం కష్టపడినా బువ్వ దొరకని స్థితి, వ్యవసాయంలో వచ్చిన నష్టాలను పూడ్చుకోలేక ఆత్మహత్యలు చేసుకొని కడతేరితే కాని సమస్య నుండి సమస్య నుంచి విముక్తం కాలేమని భావనకు వచ్చి గ్రామ ప్రాంతాల నుండి రైతులు ఆత్మహత్యల బుతువులా కోన సాగింది.
దళారీ బూటకపు వ్యవస్థలో రైతులు పట్టణాల కు వలసలు పోయి కూలి వాళ్ళుగా, బిచ్చగాళ్ళు గా తయారు చేయబడ్డారు.ఇట్లాంటి నేపథ్యం లో రైతు కుటుంబం నుంచి వచ్చిన తిర్మల్ రైతులు పడుతున్న దీనావస్థ చూసి బాధ చెంది 'తీతువు





ఎన్. తిర్మల్

పిట్ట' సంపుటిలో రైతుల దీనావస్థ కండ్లకు కట్టినట్లు కవిత్రీకరించారు. ఆరుగాలం శ్రమలో రక్తం చెమటగా ధారబోసినా దళారీ వ్యవస్థలో రైతు మాత్రం నష్టపోతూనే వున్నాడు.రైతులు చేసిన ప్రైవేటు అప్పులు చెల్లింపులు చేయలేక, బ్యాంక్ లోన్లు కట్టలేక నెల కొన్న రైతులు పడుతున్న దారుణ స్థితిగతులను కవిత్రీకరించారు.


అందుకే 'తీతువు పిట్ట' కు ముందుమాట లో సతీష్ చందర్ ఇలా అంటారు.
" తిర్మల్ కవిత్వం 'తీతువు పిట్ట' మూడు దశాబ్దాల చిట్టా .
అన్నీ వున్నాయి, గల్ఫ్ యుద్ధాలు వున్నాయి , మత కల్లోలాలు వున్నాయి, కులం దాడులూ వున్నాయి, జెండర్ వివక్షలూ వున్నాయి, ప్రాంతీయ ఆధిపత్యాలూ వున్నాయి, కవిత్వం రాసే ఉద్యమ కారులూ వుంటారు, ఉద్యమం చేసే కవులు వుంటారు."అని

'తీతువు పిట్ట' కవిత్వ సంపుటి పేజీలు మూసి ఎంత దూరం వెళ్ళినా, తిర్మల్ స్వరంతో రైతు(కవిత) కూత విన పడుతూనే వుంటుంది .

- సి హెచ్. ఆంజనేయులు,
(కవి,రచయిత) 7702537453.

## ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
సౌజన్యంతో
డా. కె. దివాకరాచారి కవితా సంపుటి
ఓమారు వెనక్కి వెళ్లిరావాలి




**ఆవిష్కరణసభ**
అధ్యక్షులు
నందిని సిధారెడ్డి
ముఖ్య అతిథి – ఆవిష్కర్త
నిఖిలేశ్వర్
ఆత్మీయ అతిథులు
ఎన్. వేణుగోపాల్
నాళేశ్వరం శంకరం
కవి యాకూబ్
పి. జ్యోతి
ఆనంద్
వేదిక:
రవీంద్రభారతి మినీహాలు, హైదరాబాద్
తేదీ: ఆదివారం, 06 జూలై 2025
ఉదయం: 10 గంటలకు

## మిథ్యాసత్యం

ఊహల్లో మెదలడమే కాదు
అమ్మ నవ్వుతున్నది
పడుకునే కాదు
కూర్చుని నిలుచుని నడుస్తున్నది
మాట్లాడుతున్నది కూడా

అమ్మ చల్లని చూపుల
దప్పికతో పరితపిస్తున్న మనసును
అంతా మిథ్య



అవి ఎండమావులన్న నిజం
నిప్పులా కాలుస్తున్నది

ఏమి లేనితనం ఎంత బరువో
ఆ లేమి భ్రమ అనితెలిసినపుడు
మనసుకు మరెంత భారమో

సర్వం మిథ్యా అన్న
శాశ్వత సత్యం ఎంత గొంతుచించుకున్నా
ఎందుకనో
మిథ్యాసత్యాన్ని
మనసు అంగీకరించదు
ఆ మిథ్యా చలనబింబాలను మోస్తూ
మనోకాయం కన్నీరు చెమరుస్తుంది

ఆ అశ్రుఅలలపై
అసత్యమై తేలే అమ్మ
నిజమై పుడుతుందనే నమ్మకమే
చేయిజాపి చల్లని నీళ్లతో
కళ్లు తుడుస్తుంది

అప్పుడు గోడపై ఫోటోలో నుంచే కాదు
ఆడియో వీడియోల్లోని
అమ్మ నవ్వు పూలుచల్లి ఆశీర్వదిస్తుంది.

- మడిపల్లి రాజ్‌కుమార్,
9949 699 215

# భవిష్యత్తుకు భరోసా వరంగల్ అర్బన్ కో- ఆపరేటివ్ బ్యాంక్

- సంస్థ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు
- దిగ్విజయంగా 29వ మహాజన సభ సమావేశం



**వరంగల్ మహా;** వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ లి., 29వ మహాజన సభ సమావేశం వరంగల్ నగరం దేశాయ్ పేట్ రోడ్డు లోని కేఆర్ గార్డెన్స్ నందు సంస్థ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ భవిష్యత్తుకు భరోసా వరంగల్ అర్బన్ కోపరేటివ్ బ్యాంకు అని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూనే మా బ్యాంకు ద్వారా ఫోన్ పే, గూగుల్ పే, డెబిట్ కార్డ్ స్వైపింగ్ వంటి అనేక సేవలను కూడా అందుబాటులో తెచ్చామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం లో 14.24% వృద్ధితో డిపాజిట్లు రూ.219.20 కోట్లకు చేరినవని రుణాల మంజూరులో 13.20% వృద్ధిలో రూ. 154.13 కోట్లకు చేరి మొత్తం బిజినెస్ రూ. 373. 43 కోట్లకు చేరుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరము లో స్థూల లాభం రూ. 3.03 కోట్లు కాగా అందులో రూ. 60.90 లక్షల ఆదాయపు పన్ను చెల్లించగా నికరలాభం రూ. 2.22 కోట్లు ఆర్జించింది. అలాగే నిరర్థక ఆస్తులు ఈ ఆర్థిక సంవత్సరంలో స్థూల నిరర్థక ఆస్తులు 2.17% నీత నిరర్థక ఆస్తులు 0.791 ఉన్నాయని తెలుపటకు సంతోషిస్తున్నామని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా డిపాజిట్ దారులకు రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు డిఐసిజిసి ద్వారా రూ 5 లక్షల వరకు ఖాతాదారులకు ఇన్సురెన్స్ సౌకర్యం కూడా కలదని తెలిపారు. ముఖ్యంగా ఈ ఆర్థిక సంవత్సరంలో నూతనంగా 4 శాఖలను ప్రారంభించామని తెలుపుటకు సంతోషిస్తున్నామన్నారు. నూతనంగా ప్రారంభించిన బ్రాంచ్ ల వివరాలు గోపాల్ పూర్, మహబూబాబాద్, జనగాం, వడ్డేపల్లి, గా చైర్మన్ వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న డైరెక్టర్లకు, ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

# కొండా వ్యాఖ్యలపై భగ్గుమన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

- అవకాశాన్ని బట్టి పార్టీలు మారడం కొండా మురళి కి పరిపాటే
- సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు, కుడా చైర్మన్



**హన్మకొండ మహా;** హన్మకొండ నగరంలోని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ శనివారం మాజీ ఎమ్మెల్సీ మంత్రి కొండా మురళి క్రమ శిక్షణ కమిటీకి తప్పుడు వివరాలు ఇచ్చి తప్పించుకోవాలని చూస్తున్నాడని కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేలా మాట్లాడి ఇప్పుడు అసలు విషయం తప్పుదోవ పట్టించాడని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా మాట్లాడడమే కాకుండా, కమిటీకి తప్పుడు వివరాలను ఇచ్చి మీడియా ఎదుట మళ్లీ ఎమ్మెల్యేల పై దురుసుగా మాట్లాడడం సరికాదన్నారు. కొండా మురళి మారని పార్టీ లేదని అవకాశాన్ని బట్టి పార్టీలు మారడం వ్యక్తులను, లీడర్లను దూషించడం ఆయనకు పరిపాటేనని అన్నారు. ఆయన 38 ఏళ్లుగా అందరికి అండగా ఉంటూ పార్టీని కాపాడుతున్నానని చెబుతున్నారు కాని, కొండా దంపతులు ఇప్పటి వరకు టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ, బీఆర్ఎస్ తో వరుసగా పార్టీలు మారుతూ వస్తున్నారని వారు ఎద్దేవా చేశారు. గత ఎన్నికల ముందే వారు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరారని గుర్తు చేశారు. వారు ఏనాడూ కాంగ్రెస్ పార్టీలో కుదురుగా లేరని ఉమ్మడి వరంగల్ జిల్లాలో అందరికంటే ఎక్కువ సార్లు పార్టీ మారింది వారే అని ఇక పార్టీలు మారడమే కాకుండా, పార్టీలోని శ్రేణులను, నమ్ముకున్న నాయకులను ఎదగనివ్వలేదని, పార్టీ పరిస్థితులను భ్రష్టుపట్టించడం వారి నైజమని తెలిపారు. ఇక తాజాగా క్రమ శిక్షణ కమిటీ పిలువకుండానే తనంతటతానే గాంధీ భవన్ కు వచ్చి ఆయన వివరాలు ఆయనే సమర్పించానని మీడియా ముందు చెప్పారు కానీ నోటీసులు ఇచ్చిన విషయం చెప్పకుండా దాచి పెట్టారని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలుపు మేరకు వచ్చినప్పటికీ ఆయన మాత్రం తన గొప్పను చాటుకోవడానికి, మీడియాలో హైలెట్ కావడానికి క్రమ శిక్షణ కమిటీ పిలువలేదని చెప్పారు అసలు విషయం మల్లు రవి మాత్రం జూలై 5వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించగా కొండా మురళి హైదరాబాద్లోని గాంధీభవన్ కు వచ్చారని అన్నారు. ఆయన తీరు ఎప్పుడు ప్రజలను, పార్టీ నేతలను తప్పుదోవ పట్టించే తీరుగానే ఉంటుందని కొండా మురళి చేసిన ప్రకటన ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుల మనోభావాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ విషయాలను క్రమశిక్షణ కమిటీ గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గతంలో అనేక సార్లు ఎన్నికల్లో ఓడిపోయి ప్రజలకు, శ్రేణులకు దూరం అయ్యారు. ఓ మంత్రిగా ఉండి కూడా గత పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక నియోజకవర్గంలో పార్టీకి మెజార్టీ కూడా సాధించలేదని తామెన్నడూ ఓడిపోలేదని ఇప్పుడు ప్రగల్బాలు పలికుతున్నారు. 2012లో పరకాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా, 2018 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓడిపోయారు. 2008లో కొండా సురేఖ ఎంపీ అభ్యర్థిగా ఓడిపోయారు. 2001లో కాంగ్రెస్ నుంచి జెడ్పీటీసీ సంగెం నుంచి బరిలో నిలిచి కొండా మురళి ఘోర పరాజయం చవి చూశారు. ఇక 2018 లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న కొండా దంపతుల ప్రవర్తన నచ్చక కేసీఆర్ మళ్లీ టికెట్ కేటాయించేందుకు నిరాకరించారని ఇది వారి కుటిల, రౌడీ రాజకీయాల్లోని గణచరిత్ర అని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనేక సార్లు పార్లమెంట్ సభ్యుడిగా, శాసన సభ్యుడిగా ఎన్నికై తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సొంతం చేసుకున్న రాంసాని సురేందర్ రెడ్డి పై పూర్తిగా తప్పుడు వార్తలు ప్రచారం చేయడం మానుకోవాలని వారు హెచ్చరించారు. 1996 లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సరేందర్ రెడ్డి పోటీ చేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అజ్మీరా చందులాల్ చేతిలో ఓడిపోయారు.1996 ఎన్నికల తర్వాత సురేందర్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారని ఆ తర్వాత ఆయన ఏ ఎన్నికల్లో పోటీ చేయలేదని అదేవిధంగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. వరంగల్ పార్లమెంట్ ఎస్సీలకు, మహబూబాబాద్ ఎస్టీలకు రిజర్వ్ అయిందని సురేందర్ రెడ్డికి నియోజకవర్గాల పునర్ విభజనలో సీటు లేకుండా చేశానని, అందుకే సురేందర్ రెడ్డి తమపై కక్షగట్టి ప్రస్తుత వరంగల్ ఇన్ చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఇబ్బంది పెడుతున్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పునర్ విభజనకు ముందే (12ఏళ్ల) ఆయన రాజకీయాల నుంచి విరమణ తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవలందించిన సురేందర్ రెడ్డి పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం కొండా మురళి చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# అంబేద్కర్ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

**కమిటీ నూతన అధ్యక్షులుగా మాదరి శివకుమార్**



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నంలో అంబేద్కర్ సేవా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఆదివారం అంబేద్కర్ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా మాదరి శివకుమార్, ప్రధాన కార్యదర్శి లకుమల్ల అరవింద్, ఉపాధ్యక్షులుగా కొలుకులపల్లి శ్రీకాంత్ లను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన అడుగుజాడలో నడుస్తూ, పలువురికి ఆదర్శంగా నిలిచేలా సంఘాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాల పట్ల, ఆయన చూపించిన మార్గం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ ఈగల రాములు, భర్తకి జగన్నాథం, దాసరి మురళి కృష్ణ, బండి మహేష్, నూకల అంగత్ కుమార్, భర్తకి రాజు, యంజాల లక్ష్మయ్య, నరేష్, కిషోర్, బస్తి పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఖర్గేకు ఘనంగా స్వాగతం పలకాలి

**ముఖ్య నాయకులకు ఎమ్మెల్యే నాయిని దిశా నిర్దేశం**



**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లోని హన్మకొండ నగరంలోని కాంగ్రెస్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతు జులై 4వ తారీఖున ఏఐసిసి అధ్యక్షులు ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని వారిని ఘనంగా స్వాగతించాలని, మన నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలందరూ తరలి వెళ్లాలని ఇందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యి ఉండాలని ముఖ్య నాయకులందరికి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారితో పాటు DCC ప్రెసిడెంట్ ఎర్రబెల్లి స్వర్ణ, నియోజకవర్గ కార్పొరేటర్లు డివిజన్ ప్రెసిడెంట్లు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ ను ప్రారంభించిన మేయర్,ఎమ్మెల్యే, కుడా చైర్మన్, కమిషనర్



**వరంగల్ మహా;** వరంగల్ మహానగర పాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ భద్రకాళి బండ్ లో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ (వీధి ఆహార విక్రయదారుల వంట కళల ప్రదర్శన, అమ్మకం) ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### ఛానల్ కార్యాలయంపై దాడి చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

**ఆదిలాబాద్‌లో జర్నలిస్టుల నిరసన**




**ఆదిలాబాద్, మహా:** హైదరాబాద్ లో మహా న్యూస్ ఛానల్ కార్యాలయం పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్ట్ జే ఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏ మేరకు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్ లో నిరసన తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ నుంచి ర్యాలీగా అక్కడికి చేరుకొని దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ నూకల దేవేందర్ మాట్లాడుతూ జర్నలిస్టులు, మీడియా కార్యాలయాలపై దాడులు నిత్యాకృత్యంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం వ్యవస్థలో ఇలాంటి భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దాడి కి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఈ నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ బీర్కూర్ వారు వెంకటేష్,జర్నలిస్టులు కృష్ణాకాంత్ గౌడ్, ఏర సుధాకర్, మెడపట్ల సురేష్, మొయిస్, అనిల్, నిలేష్, దత్తాత్రి, అభిలాష్, అరుణ్ రెడ్డి, దీపక్, కిరణ్ రెడ్డి, విఠల్, అస్మత్,నర్సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ఓ ప్రైవేట్ లిమిటెట్ కంపెనీ -అడ్డి భోజారెడ్డి

**కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ లో ప్రెస్ మీట్**

జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లిపై మాజీ మంత్రి జోగు వ్యాఖ్యలకు కౌంటర్

బీఆర్ ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం పదిహేను నెలల్లో చేసిందని వెల్లడి



**ఆదిలాబాద్, మహా :** బీఆర్ఎస్ పార్టీ అనేది ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అని కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. కంపెనీ ఓనర్ దొర చెప్పినట్టు నడుచుకోవడమే మీ పని తప్ప మీరంటూ చేసిందేమీ లేదని విమర్శించారు.ప్రజాపాలనలో ఒక జిల్లా ఇంచార్జి మంత్రిగా ప్రజల సమస్యలను అధికార యంత్రాంగం పనితీరును సమీక్షించేందుకు వచ్చిన మంత్రి పర్యటన తీవ్ర నిరాశను మిగిల్చిందని విమర్శించిన మాజీ మంత్రి జోగు రామన్న గతంలో జిల్లాకు ఏం ఒరగబెట్టారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి జోగురామన్న వ్యాఖ్యలకు కౌంటర్ గా బీఆర్ఎస్ పార్టీనుద్దేశించి ఘాటు విమర్శలు చేశారు. పదేళ్లు మీకు అధికారమిస్తే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. మీ అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచించారు కాని ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో లక్షకోట్లు మిషన్ భగీరథ ప్రాజెక్ట్ కి యాభైవేల కోట్లు ఖర్చు చేసినా ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు.ఒక్క ఉద్యోగం లేదు ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదన్నారు. డబుల్ బెడ్ రూం పథకం పూర్తిగా నిరుపయోగమన్నారు. ప్రజలకిచ్చిన ఒక్క హామీ కుడా నెరవేర్చలేదన్నారు.కాని తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అతి కొద్దిరోజుల్లోనే ప్రజా ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందిందన్నారు.ఆరు గ్యారెంటీల అమలుతో పాటు 60వేల ఉద్యోగాలిచ్చిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదన్నారు.రూ. 21వేల కోట్లు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.అంతేకాకుండా సన్నబియ్యం పంపిణీ, రూ.9వేల కోట్ల రైతుభరోసా అందించిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. పదేళ్లలో మీరు చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పదిహేను నెలల్లో చేసి చూపిందని వెల్లడించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదన్నారు. అలాగే హైదరాబాద్ లో మహాన్యూస్ కార్యాలయంపై బీఆర్ఎస్ నాయకుల దాడిని ఖండించారు.చట్టాలపై గౌరవమున్నవారు చేయాల్సిన పని కాదన్నారు. ఏది ఉన్నా న్యాయస్థానాలలో తేల్చుకోవాలి కాని ప్రత్యక్షదాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు.ఈ మీడియా సమావేశంలో నాయకులు గిమ్మసంతోష్ ,ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, మాజీ కౌన్సిలర్ సందా నర్సింగ్ ,రఫీక్,బూర్ల శంకరయ్య,రాజేశ్వర్ ,ఖయ్యూం,తోఫిక్, సాహెబ్ రావు,సిరాజ్,మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు పక్కన వాహనాలు నిలిపిన

# యజమానులపై కేసు నమోదు

**ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి. సునీల్ కుమార్**

**ఆదిలాబాద్, మహా:** ప్రమాదాలకు కారణం అవుతున్న భారీ వాహన యజమానుల పై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆదిలాబాద్ ఒకటో పట్టణ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం లాండసాంగ్వి క్రాస్ రోడ్ తిరుపెల్లి ప్రాంతంలో రోడ్డు ప్రక్కన వాహనాలు నిలిపిన పలువురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అక్కడ వాహనాలు నిలిపి ఉంచరాదని పలుమార్లు చెప్పినప్పటికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆరుగురు భారీ వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఈ వాహనాలు పార్కింగ్ ప్రదేశాలలోనే నిలిపి ఉంచాలని జిల్లా పోలీసు యంత్రాంగం తెలియజేసినప్పటికీ వాటి యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ఇకనుండి ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తూ, వాహన ప్రమాదాలను అరికట్టడం జరుగుతుందని తెలిపారు.

# చెదిరిన గ్రామాల కోసం తుమ్మల విజ్ఞప్తి

**భద్రాచలం పక్కన నాలుగు పంచాయతీల విలీనంపై కసరత్తు**

భద్రాచలం పరిసర గ్రామాల బాట తెలంగాణ వైపు

సీతారాముని సేవకు చెక్‌పోస్టు అడ్డం!" – కేంద్రానికి మంత్రి లేఖ

**ఖమ్మం, మహా:** తెలంగాణ పౌరుల సుదీర్ఘ పోరాటానికి మరో కీలక ఘట్టం కదలికలోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను కలిసి, భద్రాచలం పరిధిలోని నాలుగు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని స్పష్టమైన వినతిపత్రాన్ని అందించారు. నిజామాబాద్‌లో జరిగిన పసుపు బోర్డు ప్రారంభోత్సవం సందర్భంగా అమిత్ షా ను కలిసిన తుమ్మల, ఆ గ్రామాల పరిస్థితులపై ఓ సంక్షిప్త కానీ గంభీరమైన విజ్ఞప్తిని చేశారు.

**విభజనలో విడిపోయిన నల్లటి చాపలు...**

2014లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని అమలు చేసే సమయంలో, భద్రాచలం మండలం కేంద్రంగా ఉన్న నాలుగు గ్రామ పంచాయతీలు —— యాటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం —— అనూహ్యంగా ఏపీలో కలిసిపోయాయి. భద్రాచలం పట్టణం తెలంగాణలో కొనసాగుతున్నప్పటికీ, ఈ గ్రామాలపై పరిపాలన, అభివృద్ధి బాధ్యతలు మాత్రం ఏపీ ప్రభుత్వానికి



అప్పగించబడడం స్థానికుల జీవితాల్లో అనేక అవ్యవస్థలు, అవాంతరాలు తెచ్చింది.

**చెక్కుల లోకంలో గిరిజనుల కష్టాలు**

ఈ గ్రామాల వాసులు, ముఖ్యంగా గిరిజనులు, భద్రాచలంలోని ప్రభుత్వ కళాశాలలు, హాస్పిటల్స్, ఇతర ముఖ్య సేవల కోసం రోజూ తెలంగాణ ప్రాంతానికి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. అయితే చెక్‌పోస్టుల వద్ద ఆగాల్సిన పరిస్థితులు, ఏపీ-తెలంగాణ మధ్య నిబంధనల సంక్షోభం వలన వీరికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాణిజ్య వాహనాలకు అనుమతుల సమస్యలు, విద్యార్థులకు లోపమైన రవాణా సదుపాయాలు, స్థానిక ప్రజలకు పౌర హక్కులపైనే ఆందోళన కలిగించే స్థాయికి చేరుకున్నాయి.

# టీబీఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు..



**అధ్యక్షుడు బలవంతరావు**

**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బలవంతరావు అన్నారు. ఆదివారం తిర్పెల్లి రామ మందిరంలో నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిచయ వేదికకు రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన వచ్చిందని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ,మహారాష్ట్ర నుంచి యువతీ, యువకులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు అని తెలిపారు. బ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 22 పరిచయ వేదికలు నిర్వహించినట్లు తెలిపారు .పెళ్లికాని యువతి యువకుల వివరాలను పుస్తకం లో పొందుపరిచి తల్లిదండ్రులకు అందజేయనున్నామని తెలిపారు. దీని ద్వారా తమకు నచ్చిన సంబంధాన్ని ఎంచుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల పిల్లలకు మంచి సంబంధాలు దొరకడమే కాకుండా, ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. అదిలాబాద్ బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. వివాహ పరిచయ వేదికలో 135 మంది యువతీ యువకులు తమ వివరాలను అందజేశారని అన్నారు. కార్యక్రమంలో టీబీఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ మోహన్, ట్రెజరర్ అమిత్ దేశ్పాండే, ఆదిలాబాద్ బ్రాహ్మణ పరి షత్ అధ్యక్షుడు అన్నోజుల సంతోష్, కార్యదర్శి విశ్వాస్, ట్రెజరర్ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియాపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య

## మహా న్యూస్ ఛానల్ పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) మఫీషియల్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి. శ్రీనివాస్



**షాద్ నగర్, మహా:** మీడియా పై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని.ప్రభుత్వం తక్షణమే స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర మఫీషియల్ కమిటీ కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టియుడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో మహా న్యూస్ ఛానల్ పై జరిగిన దాడికి నిరసనగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని ముఖ్య కూడలిలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.... సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం పాటుపడుతుంటే వీధి రౌడీల్లా వచ్చి మీడియా ఛానళ్లపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన జర్నలిస్టులపై దాడులు చేయడం ఒక పిరికిపంద చర్యగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని హెచ్చరించారు. ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు వస్తే న్యాయపరంగా లేదా అందుకు కౌంటర్ ఇవ్వాలే తప్ప దాడులు చేయడం సరైన సంస్కృతి కాదని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చెక్కల శ్రీశైలం మాట్లాడుతూ.... ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం సమాచార సేవ చేస్తున్న మీడియా రంగాలపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

మహా న్యూస్ ప్రధాన కార్యాలయం పై జరిగిన దాడి సంఘటనలు సభ్య సమాజంలో తలదించుకునేలా ఉన్నాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తే వాస్తవాలు వెలుగులోకి ఎలా వస్తాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేసే మీడియాపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.... ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకులు ప్రధాన పక్షానికి మంచి సలహాలు సూచనలు ఇచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పాటుపడాలి కానీ, వార్తా ప్రసార కథనాలను అడ్డంపెట్టుకుని మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు యంత్రాంగం దాడి చేసిన వారిని పట్టుకుని తీవ్రంగా శిక్షించాలని ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని పేర్కొన్నారు. దాడులు చేసినంత మాత్రాన వాస్తవాలు బయటకు రాకుండా పోవని, నిజాలు నిర్భయంగా బయటకు వస్తాయన్న విషయాలను ప్రతిపక్ష పార్టీల నేతలు గ్రహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, జిల్లా కార్యదర్శిలు దన్నారం రమేష్,ఎండి. ఇలియస్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్, అల్వాల దర్శన్, మొహమ్మద్ సమీ, విష్ణు, నీరటి శివకుమార్, ఫయాజ్, సలీం, సాబేర్, శ్రీకాంత్, కాజా సోయల్, శ్రావణ్ గౌడ్, మహమ్మద్ రియాజ్, కార్తీక్, రమేష్, ఎక్బాల్ , పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికే ఇందిరమ్మ ఇల్లు

## రాజీవ్ యువ వికాసం పేరుతో నిరుద్యోగులను మోసం చేశారు ఎమ్మెల్యే సబితా రెడ్డి



**బాలాపూర్ మహా:** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని గ్రీన్ రిచ్ కాలనీ లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి,కాలనీ సమస్యలను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీ వాసుల తో కలిసి అల్పాహారం స్వీకరించారు. ప్రజలకు భరోసా ఇవ్వవలసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రాజీవ్ యువ వికాసం పేరు తో నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా,కాంగ్రెస్ కండువా కప్పుకున్న వాళ్ళకి ఇస్తున్నారని, ముఖ్యమంత్రి స్థాయి లో ఉన్న వ్యక్తి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అంది ఇవ్వాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజలకు అవసరమైన పనులు చేయడం లేదని సబిత అన్నారు. కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావు లను ఇబ్బంది పెట్టాలని ఆలోచన తప్ప, రాష్ట్ర ఆదాయాన్ని పెంచి ప్రజలకు పంచాలనే ఆలోచన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించమని అడుగుతే వారిని బెదిరించే ప్రయత్నం సీఎం రేవంత్ రెడ్డి చేశారని తెలిపారు. గత ముఖ్యమంత్రుల ప్రసంగం ఉందంటే ఆత్రుతగా వినే వాళ్ళమని ప్రజలకు మేలు చేసే అంశాలు ఏమైనా ప్రస్తావిస్తారని చూసేవాళ్ళమని,ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేవలం రాజకీయాలు మాత్రమే మాట్లాడుతున్నారని ప్రజలకు సంబంధించిన అంశాలను ఎక్కడ ప్రస్తావించడం లేదని అన్నారు. యూనివర్సిటీకి సంబంధించిన భూమి అని తెలిసినప్పటికీ,అక్కడ ఐటీ కంపెనీలు నెలకొల్పుతామని పంతాలకు పోతున్నారు తప్ప తనంటే తానే అభివృద్ధిని అడ్డుకోడానికి ప్రయత్నిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి పై సబితా మండిపడ్డారు. ఐటీ కంపెనీలను ఏర్పాటు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే మామిడిపల్లి లోని 500 ఎకరాలలో భూమి ఉందని గతం ప్రభుత్వ లో 40 ఎకరాలు కేటాయించడం జరిగిందని అక్కడికి ఐటీ కంపెనీలు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఫ్యూచర్ సిటీ లో పదిహేను వేల ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అదనంగా మరో 4000 ఎకరాలు సేకరించారని చిన్న,సన్నకారు రైతుల ఏమైపోతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు తొందరలోనే తగిన బుద్ధి చెప్తారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు, మాజీ కార్పొరేటర్లు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గత ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేశారు




**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ లో అడికే రాజునివాసం లో డివిజన్ అధ్యక్షులు సూర్ రెడ్డి విజయ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాన్ కి బాత్ ని తిలకించారు. మన్ కి బాత్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగినఎమర్జెన్సీ 197577 నాటి రోజులను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను అణిచివేయడం ఎంత ప్రమాదకరమో ప్రజలకు వివరించారు. యోగా ప్రాముఖ్యత అంతర్జాతీయ యోగా దినోత్సవం 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. ఆరోగ్యంగా ఉండేందుకు రోజువారీగా యోగా చేయాలని పిలుపునిచ్చారు.

**ట్రాకోమా రహిత భారత్**

భారత్ అధికారికంగా ట్రాకోమా అనే కంటి వ్యాధి నుండి పూర్తిగా విముక్తి పొందిందని ప్రకటించారు. దేశ ఆరోగ్య రంగానికి గొప్ప విజయం ధార్మిక యాత్రల ప్రాధాన్యత అమరనాథ్ యాత్ర జూలై 3 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. యాత్రలు, పుణ్యక్షేత్ర సందర్శనలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

**ప్రేరణాత్మక వ్యక్తుల కథలు**

చెనాబ్ బ్రిడ్జ్ నిర్మాణంలో పని చేసిన కార్మికులను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ సి మోర్చా పార్లమెంట్ కనివినర్ జోగు రవి, అడికే మహేందర్ ,బాల శ్రీనివాస్ యాదవ్, జోగు విజయ్ , జున్ను పవన, శివ శంకర్ ,అరుణ్ కుమార్, ప్రేమ్ కుమార్,అభిలాష్, డి వేణు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన నేత రాంబాల్ నాయక్ ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

### తాండకు తరలి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు

**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఎక్లాస్ ఖాన్ పేట పొడగుట్ట తండాకు చెందిన మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, భారత రాష్ట్ర సమితి గిరిజన నాయకులు రాంబల్ నాయక్ తండ్రి ఇటీవలే మరణించిన విషయం తెలుసుకొని మాజీమంత్రి హరీష్ రావు, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ఎస్టీ ఎస్సీ కమిషన్ సభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, తన గ్రామానికి వచ్చి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. రాంబాల్ నాయక్ తండ్రిని కోల్పోవడం ఎంతో బాధాకరం అని తెలిపారు..

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..

## సమావేశంలో పాల్గొన్న కొండా మురళీధర్ రావు



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఆర్ఎస్టీ రోడ్ లో గల ఆర్యవైశ్య పట్టణ సంఘాన్ని మొదట సందర్శించారు. ఈ సందర్భంగా గత సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాష్ సంఘాన్ని అడ్డుపెట్టుకొని ఆయన చేసిన మోసాలు, సంఘాన్ని భ్రష్టుపట్టించిన తీరు, సంఘంలో జరిగిన భారీ అవకతవకలను సంఘం పెద్దలు కొండా మురళీధర్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆర్యవైశ్య సంఘం పెద్దలతో మీరు కలిసికట్టుగా ఐకమత్యంతో ముందు మీరు ఒక కమిటీ వేసుకుని ముందుకు సాగండి, మీ వెంట నేను ఉన్నానంటూ వారికి భరోసా ఇస్తూ అన్యాయం జరిగిన బాధితులకు తప్పకుండా న్యాయం జరిగేలా ప్రస్తుత నిర్వాహకులు, సంఘం పెద్దలు, నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు తమ సంఘం సమస్యలను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సమస్యలు విని తెలుసుకొని అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు. భవిష్యత్తులో కూడా ఏమైనా సమస్యలు ఉన్నచో తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామని, సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా కొండా మురళి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జక్కులుద్దీన్ లోని ఎకరం భూమిని ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి కేటాయిస్తామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు హామీ ఇవ్వడం జరిగింది.

# ఇష్టానుసారంగా కడుతున్న బ్యానర్లతో వాహనదారులు అవస్థలు

**షాద్ నగర్, మహా:** చిన్నపాటి గాలివానకే రోడ్డు వెంట కట్టిన బ్యానర్ ఎగిరొచ్చి వాహనదారులపై పడటంతో యువకుడికి గాయాలాయ్యాయి. షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడలిలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. సాయంత్రం వేళ ప్రారంభమైన వానతో పాటు చిన్నపాటి గాలి తోడవడంతో రోడ్డు మధ్యలో కట్టిన బ్యానర్ ఒక్కసారిగా అటుగా బైకు పై వస్తున్నా యువకుడిపై పడింది. దీంతో యువకుడు బండి తో సహా కిందపడి గాయాలు పాలయ్యాడు. నిత్యం జన సంచారం ఉండే రోడ్లమీద అది పాతజాతీయ రహదారి మీద ఇలా బ్యానర్లు కట్టడం పలుమార్లు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇకనైనా పురపాలిక దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## బుద్ధారంలో పర్యటించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలంలోని బుద్ధారం గ్రామంలో శాసనసభ్యులు సత్యనారాయణ రావు ఆదివారం పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న అంగన్వాడీ భవనాలకు అవసరమైన స్థలాలను ఈడబ్ల్యూఐడీసీ డీఈ రామకృష్ణ, ఏఈ జీవన్ కుమార్, గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు పరిశీలించారు. అంగన్వాడి భవన నిర్మాణానికి భూసేకరణ, పాఠశాల ప్రహరీ గోడ పునరుద్ధరణ పనులు, పాఠశాల ప్రాంగణంలో ఓపెన్ జిమ్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు విద్యార్థులకు ఇతర మౌలిక వసతుల కల్పనల కొరకు అధికారులతో చర్చించారు. బస్టాండు సెంటర్లో కొత్తగా నిర్మించనున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆర్చి పనులకు సంబంధించి అధికారులతో చర్చించారు.గ్రామంలోని అన్ని పనులకు త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. త్వరలోనే ఇట్టి అన్ని పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు.



## 50 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లకు శంకుస్థాపన

### నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హన్మకొండ మహా;** బల్దియా పరిధి 1వ డివిజన్ లోని పలివెల్పుల ప్రాంతం లో కార్పొరేషన్ సాధారణ (జనరల్) నిధుల కింద రూ.100 లక్షల అంచనా వ్యయం తో దుర్గా మాత ఆలయం నుండి పలివెల్పుల వరకు నిర్మించనున్న బీటి రోడ్డు పనులతో పాటు ఎర్రగట్టు గుట్ట మంత్రపురి కాలనీ లో 15 వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.50 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న అంతర్గత సి సి రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం వర్ధన్న పేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ అరుణ కుమారి, స్థానిక నాయకులు దేవరకొండ అనిల్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు, పాల్గొన్నారు.


## తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే

# పుట్ట మధు కపట నాటకం



**కాటారం, మహా :** మంథని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి పుట్ట మధు చేసిన తప్పిదాలను కప్పికప్పిపుచ్చుకోవడానికి కపట నాటకాలు ఆడుతున్నారని కాటారం మండలం కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం కాటారం వై టి సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. నియోజకవర్గంలో దళితులంతా శ్రీధర్ బాబు వెన్నంటి ఉన్నారని హైదరాబాదు నుంచి రాష్ట్ర దళిత నాయకులు వచ్చి శ్రీధర్ బాబు గొప్పతనాన్ని సేవలను కొనియాడారని అన్నారు. పుట్ట మధు ప్రెస్ మీట్ లో శ్రీధర్ బాబు కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన చేసిన నిరాధారమైన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ ప్రాంతంలో జరిగిన హత్యలు దోపిడీలు దొంగతనాలన్నీ చారిత్రక ఘట్టాలని పుట్ట మధు పేర్కొనడాన్ని తీవ్రంగా అభిశంసించారు. శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు దళిత నాయకుల పట్ల చాలా గౌరవంగా ప్రేమ తో ఉన్నారని వారి అవసరాలను పనులను స్వేచ్ఛగా చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి పట్ల పూర్తి అవగాహన కలిగి పనులు చేస్తున్నారని ఏ ఒక్క కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఫిర్యాదు చేయకున్నా కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలలో తలదూర్చి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తీవ్రంగా తీయబట్టారు. గట్టు వామనరావు దంపతుల హత్య కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలవరుస్తుందని సిబిఐ విచారణకు ఆదేశించే అవకాశం ఉందని సీనియర్ అడ్వకేట్ల అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. చేసిన తప్పిదాలను, మోసాలను, దోపిడీలను, అన్యాయాలను, హత్యలను కప్పిపుచ్చుకోవడానికి కపట నాటకాలు ఆడుతున్నారని ఇవి మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో మీ పాత్ర ఏంటని? మీ పార్టీ వ్యవహారాలలో మీరు జోక్యం చేసుకోవాలని హితవు పలికారు. పుట్ట మధు ఆరోపణలు మంథని నియోజకవర్గ ప్రజలను అవమానపరిచినట్లు ఉందని వారికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా పోయిన పరువు దక్కించుకోవాలని ప్రజలను తప్పుదోవ పట్టించి గెలుపొందాలని కుట్రలు పన్నుతున్నారని,అందుకొరకు ప్రజలనే దోషులుగా చిత్రీకరించడానికి కూడా వెనుకడడం లేదని తీవ్రంగా విమర్శించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేనియెడల రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

# 1984 -85 పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 198485 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉప్పర్ పల్లి ఇంపిరియా బ్యాంకెట్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎనభై మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ముగ్గురు ఉపాధ్యాయులు ఈ ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నారు. చిన్ననాడు తాము చదువుకున్న మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. తమ కు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి ఆశీర్వచనాలు పొందారు. తమకు పాఠాలు చెప్పి గురువులను, తమతో చదువుకొని మరణించిన స్నేహితులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. తాము నేడు ఏ పని చేస్తున్నాం.. ఎక్కడెక్కడ స్థిరపడ్డామో ఉపాధ్యాయుల విద్యార్థులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులతో కలిసి అందరు కలసి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నలభై సంవత్సరాల జ్ఞాపికలు అందజేశారు.

**విద్యార్థులకు మిఠాయిలు తినిపించిన ఉపాధ్యాయురాలు కమల**

తమ వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయురాలు కమల విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు. తమ పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టడం ఎంతో ఆనందంగా ఉం దన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.శ్రీధర్, ఎంశ్రీనివాస్ యాదవ్, ఎండీ షర్ఫుద్దీన్, బి.వేణుగోపాల్, సామ సుమన్ రెడ్డి, కాశీ విశ్వనాథ్ గౌడ్, ఎం.రాంబాబు యాదవ్, వేముల చక్ర పాణి, ఎస్. నర్సిహ్మారెడ్డి, బి.ఆంజనేయులు, మంజూర్ అహ్మద్. కె. విజయ్ కుమార్, రవీందర్ షిం డే, ఎం.నాగభూషణం, విజయలక్ష్మి, కె సరోజ, వనితారెడ్డి, రమాదేవి, ఎన్.బాబురావు, సత్యనారాయణ, జి. చిమన్ లాల్, సయ్యద్ హిదాయతుల్లా షఫీ, జయశ్రీ., రాజేందర్, నాగ భూషణం, తదితరులు పాల్గొన్నారు.

# మీడియా మీద దాడులు చేయడం తగదు

## నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### కడ్తాల్ జర్నలిస్ట్ సంఘము మండల అధ్యక్షుడు రామకృష్ణ



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ విషయంలో వార్తలు ప్రచురిస్తున్నారని, అక్కసుతోనే బిఆర్ఎస్ శ్రేణులు మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేయడం తీవ్రంగా కండిస్తున్నట్లు, కడ్తాల్ మండల జర్నలిస్ట్ సంఘము మండల అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. మీడియా చానళ్ళు ప్రచురించే వార్త కథనాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్యంలో స్పందించి తీరు ఇది కాదని, తమపై వచ్చిన ఆరోపణలను మీడియా ముఖంగా ఖండించడం, లేదంటే న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి ఉంటుంది. కానీ మీడియా సంస్థలపై దాడికి పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆదివారం అయన కడ్తాల్ పట్టణంలో మాట్లాడుతూ... మీడియాపై దాడులు చేయడం అత్యంత హేనీయమని విమర్శించారు. రాష్టంలో మహా న్యూస్ పై జరిగిన దాడులను ఖండిస్తూ, జర్నలిస్టులు నిరసన చేసే పరిస్థితి ఉందన్నారు.

# నాగటి భాస్కర్ సేవలు మరువలేనివి

## జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థి దశ నుండి ఉద్యమాల బాటలో నడిచిన నాగటి భాస్కర్ ప్రజా సేవలోనే గాక, తదుపరి ఉద్యోగ సంఘాల నేతగా అందించిన సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ, ఆకస్మికంగా మృతి చెందిన తులేకలాన్ గ్రామానికి చెందిన భాస్కర్ ప్రథమ వర్ధంతి ఆదివారం ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. భాస్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి ఉద్యమాలలో, ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న భాస్కర్ అనంతరం ప్రభుత్వ ఉద్యోగిగా కూడా నిబద్ధతతో పనిచేసాడని చెప్పారు. చిన్న వయస్సులోనే అందరివాడుగా పేరొందిన భాస్కర్ అకాలమరణం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాస్కర్ సతీమణి, తులేకలాన్ మాజీ ఎంపిటిసి నాగటి నాగమణి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, తాజా మాజీ సర్పంచ్ యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు నరసింహ్మా, జనార్ధన్ రెడ్డి, రమేశ్, బాష, కళ్యాణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

## జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జులై 9 వ తేదీన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, ఆదివారం చేవెళ్లలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె రామస్వామి హాజరై మాట్లాడుతూ... కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల పైన, రైతుల పైన దాడి మొదలు పెట్టాడని కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను, పెట్టుబడిదారీ వర్గానికి కొమ్ము కాస్తూ నాలుగు కోడ్ లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయానికి గురి చేస్తున్నాడని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడం జరుగుతుందని, కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలు పోయి 12 గంటల పని దినాలు రావడం జరుగుతుందని, మోడీ ప్రభుత్వం కేంద్రంలో వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దానికి అనుగుణంగా కార్మికుల యొక్క జీతభత్యాలు పెరగడం లేదని, పెద్ద నోట్ల రద్దు జిఎస్టి తీసుకురావడం వల్ల అనేక రకాల చిన్న మధ్యతరహా పరిశ్రమలు మూతపడి, వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వారి జీవనం అస్తవ్యస్తంగా మారిపోయిందని దానికి కారణం కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వమే, అందుకే జూలై 9 వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు అన్ని ఒకే తాటిపైకి వచ్చాయని, ఈ సమ్మెలో కార్మికులు కర్షకులు, ప్రజలు రైతులు పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు వేలాదిగా అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తి రెడ్డి, ఇన్సాబ్, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, బిఓసి జిల్లా కార్యవర్గ సభ్యుడు జయ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ పేరు సింధూర్ గా నామకరణం





**రాజేంద్రనగర్, మహా:** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ని లక్ష్మీ గూడ వాంబే కాలనీ లో నూతనంగా నిర్మించబడిన కాలనీకి సింధూర్ కాలనీ బోర్డును కాలనీవాసుల తో కలిసి కార్పొరేటర్ ఆదివారం ఆవిష్కరించారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వం లో ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో త్రివిధ దళాల కు వందనం మన దేశ ఐక్యతకు, వీర పోరాటానికి చిహ్నంగా, కాలనీ పేరు ను సింధూర్ కాలనీ ప్రకటించం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లగా పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించి నూతన రోడ్లు వేయించి కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించిన కార్పొరేటర్కి కాలనీవాసులందరు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడికే జనార్ధన్, సుబ్బారెడ్డి, మనీష్ తివారి, మధుసూదన్ రెడ్డి, ఉజ్వల్, అడికే శివ, సంతోష్, శ్రీధర్ రెడ్డి, ఓం ప్రకాష్, సంపత్, మనీష్ రత్నాకర్, శంకర్ రెడ్డి, మహేష్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# బంగారం భారీ రేట్లు.. డిమాండ్‌లో మార్పులు

బంగారం రేట్లు భారీ స్థాయిలో పెరిగిన నేపథ్యంలో వివిధ సెగ్మెంట్లలో డిమాండ్‌లో మార్పులు కనిపించ వచ్చని బ్రాండెడ్ ఆభరణాల తయారీ దిగ్గజం టైటాన్ తమ 2024-25 వార్షిక నివేదికలో పేర్కొంది. భౌగోళిక-రాజకీయ అంశాలు, స్థూల ఆర్థిక అనిశ్చితుల వల్ల పసిడి రేట్లు అధిక స్థాయిలోనే కొనసాగవచ్చని వివరించింది. రిటైల్ విస్తరణ, కొత్త కలెక్షన్లు, మార్కెటింగ్‌పై మరింతగా పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రాధాన్యతనివ్వడాన్ని కొనసాగిస్తామని టైటాన్ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో పసిడి రేట్లు భారీ స్థాయిలో ఉన్నప్పటికీ జ్యువెలరీ డివిజన్ ఆరోగ్యకరంగా 20 శాతం, సేమ్-స్టోర్ అమ్మకాల వృద్ధి 14 శాతం మేర నమోదైందని వివరించింది. తనిష్క్ సబ్-బ్రాండ్ అయిన మీయా రూ. 1,000 కోట్ల మార్కును దాటగా, క్యారట్‌లెన్ విభాగం ఆదాయం 30 శాతం పెరిగిందని పేర్కొంది.

# ఇక ఏడాదికి ఇన్నే ఆడిట్లు.. సీఏలకు కొత్త రూల్



వ్యక్తిగతంగా గానీ లేదా ఏదైనా సంస్థలో భాగస్వామిగా గానీ చార్టర్డ్ అకౌంటెంట్లు సంవత్సరానికి ట్యాక్స్ ఆడిట్లు 60 మాత్రమే చేసేలా చార్టర్డ్ అకౌంటెంట్స్ ఇనిస్టిట్యూట్ ఐసీఏఐ నిర్ణయం తీసుకుంది. ఈ పరిమితి 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. ఇప్పుడు కూడా ఈ నిబంధన ఉన్నప్పటికీ, పార్ట్‌నర్స్ కోసం కూడా ఆడిట్ నిర్వహించేందుకు వెసులుబాటు ఉంది. తాజాగా ప్రతిపాదించిన పరిమితిలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఐసీఏఐ ప్రెసిడెంట్ చరణ్‌జోత్ సింగ్ నందా తెలిపారు. అవకతవకలు జరగకుండా చూసేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం యూనిక్ డాక్యుమెంట్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూడీఐఎన్) సిస్టంను ప్రవేశపెట్టినట్లు వివరించారు. యూడీఐఎన్ అనేది ప్రాక్టీస్ చార్టర్డ్ అకౌంటెంట్ చేత సర్టిఫై చేసిన లేదా ధృవీకరించిన ప్రతి డాక్యుమెంట్ కోసం జనరేట్ చేసే ఒక ప్రత్యేక సంఖ్య. దేశీయ చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థలకు విదేశీ నెట్‌వర్కింగ్ మార్గదర్శకాల ముసాయిదాపై అభిప్రాయాలను సమర్పించడానికి గడువును జూలై 16 వరకు పొడిగించింది.

# పట్టాలెక్కిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్..

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పట్టాలెక్కింది. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ తదితర అభివృద్ధి ప్రణాళికలతో నగర స్థిరాస్తి రంగం పుంజుకుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో నగరంలో 10,741 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే కేవలం 3 శాతం తగ్గుదల కనిపించింది. గృహ కొనుగోలుదారులు ప్రీమియం, హైఎండ్ లగ్జరీ గృహాలకే మొగ్గు చూపిస్తుండటంతో అందుబాటు, మధ్యస్థాయి గృహాల లాంచింగ్స్ స్వల్పంగా తగ్గాయని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది.



### హాట్‌స్పాట్ ప్రాంతాలివే..

లాంచింగ్స్‌లో పశ్చిమ హైదరాబాద్ ఆధిపత్యాన్ని చలాయిస్తోంది. మొత్తం లాంచింగ్స్‌లో ఈ జోన్ వాటా ఏకంగా 51 శాతంగా ఉంది. వెస్ట్ హైదరాబాద్‌లో నానక్‌రాంగూడ ప్రధాన హాట్‌స్పాట్‌గా నిలిచింది. లాంచింగ్స్‌లో ఉత్తర హైదరాబాద్ వాటా 18 శాతంగా ఉండగా.. ఈ జోన్‌లో బాచుపల్లి హాట్‌స్పాట్‌గా ఉంది. ఇక, దక్షిణ హైదరాబాద్ వాటా 17 శాతంగా ఉండగా.. రాజేంద్రనగర్ హాట్‌స్పాట్‌గా ఉంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి పశ్చిమ హైదరాబాద్ చోదకశక్తిగా ఉన్నప్పటికీ.. రెండేళ్లుగా క్రమంగా తగ్గుతోంది. ఇదే సమయంలో భూమి లభ్యత, అందుబాటు ధరల కారణంగా ఉత్తర, తూర్పు, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాలు క్రమంగా వృద్ధి చెందుతున్నాయి. శివారు ప్రాంతాలలో గృహ నిర్మాణాలు పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం.

### హైఎండ్ లగ్జరీదే ఆధిపత్యం..

2025 క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాలలో లాంచింగ్స్‌లో అత్యధికంగా 83 శాతం హైఎండ్ లగ్జరీ యూనిట్లు హైదరాబాద్‌లోనే లాంచింగ్ అయ్యాయి. నగరంలో 2024 క్యూ1లోని లాంచింగ్స్‌లో ప్రీమియం ఇళ్ల వాటా 34 శాతంగా ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 70 శాతానికి పెరిగింది. నానక్‌రాంగూడ, గండిపేట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో ప్రీమియం ఇళ్లకు అత్యధిక డిమాండ్ ఉంది. లాంచింగ్స్‌లో మధ్యస్థాయి విభాగం గృహాల వాటా 17 శాతంగా ఉంది. అత్యధికంగా బాచుపల్లిలో ఈ తరహా ఇళ్లకు గిరాకీ ఉంది. తూర్పు హైదరాబాద్‌లో ఎక్కువగా ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది.

### పెరిగిన ఇళ్ల అద్దెలు..

నగరంలో గృహాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 7 శాతం పెరిగాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి, కోకాపేట ప్రాంతాల్లోని అద్దె ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఐటీ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, ఇతర ఉన్నతస్థాయి వర్గాలు ఆయా ప్రాంతాలలో నివసించేందుకు ఆసక్తి చూపిస్తుండటమే అద్దెల పెరుగుదలకు ప్రధాన కారణం.

### ఆఫీసు స్పేస్ అదరహో..


నగరంలో 2025 క్యూ1లో 18.2 లక్షల చ.అ. నికర ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. లక్ష చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైన ఆఫీసు లీజులు అత్యధికంగా జరిగాయి. హెల్త్‌కేర్, ఫార్మా, బ్యాంకింగ్ రంగాలలో కంపెనీల విస్తరణల కారణంగా లావాదేవీలలో వృద్ధి నమోదైంది. 2025 క్యూ1లోని ఆఫీసు స్పేస్ లీజులలో అత్యధికంగా 32 శాతం హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగాలది కాగా.. ఆ తర్వాత ఐటీ-బీపీఎం విభాగం 21 శాతం, బ్యాంకింగ్ అండ ఫైనాన్షియల్స్ విభాగం వాటా 11 శాతంగా ఉంది. మాదాపూర్ (81 శాతం), గచ్చిబౌలి (16 శాతం) ప్రాంతాల్లోని ఆఫీసు స్పేస్‌కు ఎక్కువ డిమాండ్ ఉంది.

### సప్లయి 13.2 లక్షల చ.అ.

ఇక నగరంలో 2025 క్యూ1లో కొత్తగా మార్కెట్‌లోకి 13.2 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి అయింది. అయితే గతేడాది క్యూ1తో పోలిస్తే మాత్రం ఇది 55 శాతం తగ్గుదల. ఆఫీసు స్పేస్ ప్రాజెక్టల అనుమతుల జారీలో జాప్యమే ఈ తగ్గుదలకు ప్రధాన కారణం. నగరంలో కార్యాలయ స్థలాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 13 శాతం మేర పెరిగాయి. అత్యధికంగా మాదాపూర్‌లో అద్దెలు పెరిగాయి. ఈ ప్రాంతంతో పోలిస్తే గచ్చిబౌలిలో కిరాయిలు 20-25 శాతం తక్కువగా ఉన్నాయి. మెట్రో ఫేజ్-2, హెచ్-సిటీ రోడ్ల విస్తరణ వంటి మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళికలతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. దీంతో దీర్ఘకాలంలో ఆఫీసు అద్దెలు మరింత వృద్ధి చెందుతాయి.

# ఈ కంపెనీ ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు ఇక ఉండవ్

జపాన్‌కు చెందిన ప్రముఖ అప్లయెన్సెస్ అండ్ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ పానాసోనిక్ నుంచి ఫ్రిజ్‌లు, వాషింగ్‌మెషీన్లు ఇక రావు. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా భారతదేశంలోని రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ విభాగాల నుండి పానాసోనిక్ నిష్క్రమించింది. ఈ సెగ్మెంట్లు రెండూ భారత్‌లో పానాసోనిక్‌కు నష్టాల్లో ఉన్న వ్యాపారాలు. ఇక్కడ మార్కెట్లో స్థానం సంపాదించడానికి కష్టపడుతున్నాయి. మార్కెట్ రీసెర్చ్ సంస్థ జీఎఫ్‌కే గణాంకాల ప్రకారం.. రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్ విభాగాలలో పానాసోనిక్ చాలా తక్కువ మార్కెట్ వాటాను కలిగి ఉంది. వాషింగ్ మెషీన్లలో దీని వాటా 1.8 శాతం, రిఫ్రిజిరేటర్లలో 0.8 శాతంగా ఉంది. ఈ రెండు సెగ్మెంట్లలో పానాసోనిక్ గత ఆరేళ్లుగా అమ్మకాల్లో నష్టాలను చవిచూస్తోంది. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ విభాగాల నుండి నిష్క్రమిస్తున్నప్పటికీ డీలర్ల వద్ద ఇప్పటికే ఉన్న ఆయా ఉపకరణాల అమ్మకాలకు సహకరిస్తామని, విడిభాగాలు, వారంటీ కవరేజీతో సహా పూర్తి కస్టమర్ సేవను అందిస్తూనే ఉంటామని పానాసోనిక్ తెలిపింది.స్తబ్దత నుంచి బయటపడేందుకు, భవిష్యత్తులో బలమైన, పునరుద్ధరించిన వృద్ధి కోసం పానాసోనిక్ గ్రూప్‌ను నిలబెట్టడానికి ప్రపంచవ్యాప్తంగా నష్టాల్లో ఉన్న వ్యాపారాల నుంచి నిష్క్రమించాలని యోచిస్తున్నట్లు ఈ ఏడాది మేలో పానాసోనిక్ గ్రూప్ సీఈఓ యుకీ కుసుమి తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరంలో పానాసోనిక్ ఇండియా ఆదాయం సుమారు రూ .11,500 కోట్లు.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






# భారత్‌పై పాక్ ఆర్మీ చీఫ్ అనుచిత వ్యాఖ్యలు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. భారత్ ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతోంది అంటూ వింత వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో భారత్ గనుక మరోసారి పాకిస్తాన్‌పై దాడి చేస్తే.. తమ ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని హెచ్చరిస్తున్నట్టు తెలిపారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. పాక్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ కరాచీలోని నేవల్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్నీర్.. భారత్‌కు వ్యూహాత్మక ముందుచూపు కొరవడింది. ప్రాంతీయ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోంది. ప్రాంతీయ స్థిరత్వాన్ని పాకిస్తాన్ కాపాడుతోంది. భారత్ దూకుడు వేళ పాక్ బలంగా స్పందించింది. ప్రాంతీయ శాంతిని దృష్టిలో పెట్టుకొని పాకిస్తాన్ పరిపక్వంగా ఆలోచన చేసింది. పాక్ ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేసే స్థితిలో ఉంటే.. భారత్ ఉద్రిక్తతలు సృష్టిస్తోంది. మరోసారి పాకిస్తాన్‌పై దాడికి పాల్పడితే నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తాం' అంటూ హెచ్చరించారు. మరోవైపు.. అంతకు ముందు కూడా మునీర్.. భారత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. భారత్ నెట్‌వర్క్‌కు ఆఫ్ఘనిస్థాన్ వేదికగా మారిందన్నారు. అక్కడి వారితో పాకిస్తాన్‌పై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. అలాగే, పాక్.. ఆఫ్ఘనిస్తాన్‌తో స్నేహ సంబంధాలను కోరుకుంటోంది. కానీ, ఆ దేశం భారత్ పోషిస్తున్న ఉగ్రవాదులకు వేదిక ఇవ్వకూడదని కోరుకుంటున్నా అంటూ పొంతనలేని వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ దాడులు పాకిస్తాన్‌కు చుక్కలు చూపించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్‌కు కీలకమైన ఎయిర్‌బేస్‌లపై భారత్ విరుచుకుపడింది. దీంతో, ఎయిర్‌బేస్‌లు ధ్వంసమయ్యాయి. వీటిల్లో పాక్ సైనిక ప్రధాన కార్యాలయానికి సమీపంలోని నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ కూడా ఉంది. ఆపరేషన్ సింధూర్ దెబ్బకు దాదాపు 8 కీలక మిలిటరీ స్థావరాలు దెబ్బతిన్నాయి.

# రష్యా-ఉక్రెయిన్ వార్ చరిత్రలోనే.. అతి పెద్ద దాడి ఇదే

శనివారం రాత్రి రష్యా 477 డ్రోన్లు, 60 క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది. యుద్ధం మొదలైన నాటి నుంచి జరిగిన అతిపెద్ద దాడి ఇదేనంటూ ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటిల్లో 249ని కూల్చేశామని.. మరో 226 ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యవస్థల ప్రభావంతో కూలిపోయాయని.. గత రాత్రి అతిపెద్ద దాడే జరిగిందంటూ ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ దాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్ 16 యుద్ధ విమానం కూలిపోయిందని.. ఒక పైలట్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం రష్యా ఆరు గంటలకు పైగా దాడులు చేసింది. దేశ వ్యాప్తంగా కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతీన్నాయని అధికారులు పేర్కొన్నారు. రష్యాఉక్రెయిన్ మధ్య 2022 దాడులు కొనసాగుతున్నాయి. 36 నెలలు గడిచినా ఆగని రష్యా, ఉక్రెయిన్ పోరు ఆగడం లేదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో వెలుగుచూసిన అతిపెద్ద వైరం ఇదే. వాస్తవానికి తాజా యుద్ధానికి పునాదులు పదేళ్ల క్రితమే పడ్డాయి. 2014లో ఉక్రెయిన్‌లోని క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా ఉన్నపళంగా ఆక్రమించుకుంది. ఆనాటి నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఉక్రెయిన్ పైకి రష్యా దండయాత్ర మొదలెట్టింది. వందల కొద్దీ చిన్నపాటి క్షిపణులు ప్రయోగిస్తూ వేలాది సైనికులను కదనరంగంలోకి దింపింది. తొలి రోజుల్లో రాజధాని కీవ్‌దాకా దూసుకొచ్చి భీకర దాడులు చేసిన రష్యా ఆ తర్వాత ఆక్రమణ వేగాన్ని అనూహ్యంగా తగ్గించింది. ఉక్రెయిన్ వైపు నుంచి ప్రతిఘటన కూడా దీనికి ఒక కారణం. ఉక్రెయిన్ తొలినాళ్లలో యుద్ధంలో తడబడినా ఆ తర్వాత అగ్రరాజ్యం, యూరప్ దేశాల ఆర్థిక, ఆయుధ, నిఘా బలంతో చెలరేగిపోయింది. ధాటిగా దాడులు చేస్తూ పుతిన్ పటాలానికి ముచ్చెమటలు పట్టించింది. దీంతో మరింత శక్తివంతమైన ఆయుధాలను రష్యా బయటకుతీయక తప్పలేదు.





# కిరికిరి మొదటికి వచ్చింది..

## మరోసారి బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై మస్క్ విమర్శలు

**వాషింగ్టన్:** అపరకుబేరుడు ఎలాన్ మస్క్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఈ ఏడాది ట్రంప్ ప్రవేశపెట్టిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'పై ఎలాన్ మస్క్ తాజాగా మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఈ బిల్లును అమలు చేసేలా దిశగా దాదాపు చర్చకు సిద్ధమవుతోంది. ఇందుకోసం 1,000 పేజీల ప్రతిపాదనను సిద్ధం చేసింది. ఈ తరుణంలో.. ఆ బిల్లు అవివేకం, విధ్వంసకరం' అని మస్క్ అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా మస్క్ ట్వీట్ చేశారు. వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్‌ను చట్టం చేసే ప్రయత్నంలో 'బిల్లు డ్రాఫ్ట్'ను అమెరికా ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో బిల్లు డ్రాఫ్ట్‌ను మస్క్ తప్పుబట్టారు. తాజా సెనేట్ డ్రాఫ్ట్ బిల్లు మిలియన్ల మంది ఉద్యోగాలకు ఎసరు పెడుతోంది. దేశానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. అధికార రపబ్లికన్ పార్టీ లీడర్లకు ఇదే నా హెచ్చరిక. బిల్లు చట్టంగా మారిస్తే విధ్వంసం సృష్టించినట్లే. అంతేకాదు, చట్టం అమలైతే ఇప్పటికే స్థాపించిన పరిశ్రమలు, ప్రారంభించబోయే పరిశ్రమలకు రానున్న రోజుల్లో అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందనే పేర్కొన్నారు. ఇంతకుముందు కూడా హౌస్‌లో ప్రవేశపెట్టిన బిల్లును మస్క్ వ్యతిరేకించారు. ఆబిల్లుకు ఆమోదం లభించడంతో టెస్లా విలువ భారీగా పతనమైంది. నాటి నుంచి గత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్,ఎలాన్ మస్క్‌ల మధ్య వైరం మొదలైంది. దుబారా ఖర్చు



ల్ని తగ్గించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (doge) సారధ్య బాధ్యతల నుంచి తప్పుకున్నారు. వరుసగా ట్రంప్ తీరును బహిరంగంగా ఎండగడుతూ వచ్చారు. ఒకానొక దశలో నేను ప్రచారం చేయకపోతే రిపబ్లికన్ అధికారంలోకి వచ్చేదే కాదు. ఆ పార్టీ నేతలు 50కే పరిమితమయ్యేదని వ్యాఖ్యానించారు. ఎప్స్టీన్ ఫైళ్లలో ట్రంప్ ఉన్నారంటూ బాంబు పేల్చారు. అందుకే ఎప్స్టీన్ ఫైళ్లను బహిర్గతం చేయటం లేదంటూ ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ట్రంప్ సైతం మస్క్‌ను అదే స్థాయిలో ప్రతి విమర్శలు చేశారు. మస్క్ తీరు ఇలాగే కొనసాగితే మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులకు, రాయితీలకు కోత వేస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి ఏమైందో ఏమో.. తాను చేసిన వ్యాఖ్యలకు ట్రంప్ మస్క్ క్షమాపణలు చెప్పారు. అనూహ్యంగా మళ్లీ బిగ్ బ్యూటిఫుల్ బిల్‌ను వ్యతిరేకిస్తూ కామెంట్లు పెట్టారు. మరి ఈ కామెంట్లకు ట్రంప్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# భారత్‌పై పాక్ దుష్ప్రచారం..


## ఆర్మీ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి మీ పనే..



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి 13మంది సైనికులు దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటనను పాకిస్తాన్ భారత్ పైకి నెట్టేసింది. తమ దేశ సైనికుల మరణానికి భారత్ కారణమని ప్రచారం చేస్తోంది. అయితే, పాక్ ప్రచారాన్ని భారత్ ఖండించింది. పాక్ చేస్తున్న ప్రచారం ఆమోదయోగ్యం కాదంటూ ఆదివారం విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా హెచ్చరికలు జారీ చేశారు. జూన్ 28న పాక్ ఉత్తర వజీరిస్తాన్ జిల్లా ఖైబర్ పఖ్తున్ఖ్వాలో ఆర్మీ సైనికులు ప్రయాణిస్తున్న కాన్వాయ్‌ని ఓ అగంతకుడు పేలుడు పదార్థాలు నిండిన వాహనంతో ఢీ కొట్టారు. ఈ ఘటనలో 13మంది ఆర్మీ సైనికులు మరణించగా..10 మంది గాయాలయ్యాయి. 13 మంది సాధారణ పౌరులు గాయపడినట్లు ప్రముఖ పాక్ మీడియా సంస్థ డాన్ తెలిపింది. ఈ దాడి వెనక భారత్ ఉందంటూ పాకిస్తాన్ అధికారంగా చేసిన ప్రకటనను ఖండించింది. వజీరిస్తాన్‌లో పాక్ ఆర్మీ కాన్వాయ్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో భారత్ ప్రమేయం ఉందని పాక్ అధికారికంగా ప్రకటన చేసింది. ఆ ప్రకటనను మేం ఖండిస్తున్నాం. ఆమోదయోగ్యం కాదని..విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

**పాక్ మీడియా ఏమంటోంది**

దక్షిణ వజీరిస్తాన్‌లో నిఘా ఆధారిత ఆపరేషన్ (IBO)లో ఇద్దరు సైనికులు మరణించి, 11 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టిన కొద్ది రోజులకే ఈ దాడి జరిగిందని డాన్ పేర్కొంది. పలు నివేదికల ప్రకారం, 2021లో కాబూల్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దు ప్రాంతాలలో హింస గణనీయంగా పెరిగింది. తమ దేశంలో తమ గడ్డను ఉపయోగించుకొని దాడులకు తెగబడుతోందని తాలిబాన్ల ప్రభుత్వంపై పాక్ ఆరోపణలు చేస్తూ వస్తోంది. ఆ ఆరోపణల్ని తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధులు ఖండించారు. కాగా,ఖైబర్ పఖ్తున్ఖ్వా, బలూచిస్తాన్ రెండింటిలోనూ ప్రభుత్వంతో పోరాడుతున్న సాయుధ గ్రూపులు ఈ సంవత్సరం ప్రారంభం నుండి జరిపిన దాడుల్లో దాదాపు 290 మంది మరణించారు. వారిలో ఎక్కువ మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు వెలుగులోకి వచ్చిన నివేదికలు హైలెట్ చేస్తున్నాయి.



# హలో.. లంచం త్వరగా ఇచ్చేయాలి

**దొడ్డబళ్లాపురం(కర్ణాటక):** స్టాఫ్ నర్స్ కాంట్రాక్ట్ రెన్యూవల్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన డాక్టర్ ఆడియో ఒకటి వైరల్‌గా మారిన ఘటన చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా జవగొండనహళ్లిలో వెలుగు చూసింది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండేళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ రెన్యూవల్ కోసం అక్కడి వైద్యుడు డాక్టర్ క్రిష్ణను కోరగా రూ.5వేలు లంచం అడిగాడు. డబ్బు ఇవ్వకపోతే రేటు రూ.10వేలు అవుతుందని, ఇంకా లేట్ చేస్తే రూ.15వేలు అవుతుందని, ఎవరికి చెపుకున్నా తాను సంతకం పెట్టబోనని నర్స్‌ను హెచ్చరించాడు. ఈమేరకు ఆడియో లీక్ అయ్యి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

# సమంతపై ట్రోలింగ్..



శుభం మూవీ తర్వాత సమంత సోషల్ మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తోంది. ఆ మూవీతో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చిన సామ్ ప్రస్తుతం సినిమాలేవీ చేయట్లేదు. సోషల్ మీడియాలో ఇటీవల ఆరోగ్యంపై ఎక్కువగా శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. జిమ్‌లో వర్కవుట్స్ చేస్తూ తెగ బిజీ అయిపోయింది. ముంబయిలో జిమ్ వెలుపల ఆమె కనిపించడంతో కొందరు ఫోటోలు తీసేందుకు ఎగబడ్డారు. దీంతో సమంత కాస్తా అసహనానికి గురైంది.

ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో జిమ్ వర్కవుట్స్ చేస్తున్న వీడియోలను షేర్ చేసింది. అందులో వీడియోతో పాటు ఓ కోటేషన్ కూడా రాసుకొచ్చింది. తన బాడీ గురించి కామెంట్స్ వారిని ఉద్దేశించి అందులో ప్రస్తావించింది. వీటిలో మొదటి మూడు చేయగలిగితే తప్ప నన్ను సన్నగా, అనారోగ్యంగా ఉన్నారని అలా చెత్తగా మీరు పిలవలేరు అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. అయితే ఇది తన బాడీని షేమింగ్ చేస్తున్న వారిని ఉద్దేశించే చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా తాను జిమ్‌లో కష్టపడుతున్న వీడియోలను కూడా పంచుకుంది. సమంత తన వర్కౌట్ వీడియోతో ట్రోలర్స్‌కు సవాలు విసురుతోంది. కాగా.. సమంత చివరిసారిగా శుభం సినిమాలో ఓ అతిథి పాత్రలో కనిపించింది. అంతకుముందు వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'లో కనిపించింది. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం అవుతోంది. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్'తో పాటు 'బంగారం' అనే తెలుగు చిత్రంలో కనిపించనుంది.



## ఓటీటీలో దూసుకెళ్తున్న తెలుగు క్రైమ్ డ్రామా!

చిన్న సినిమాలో ఓటీటీలో దూసుకెళ్తున్నాయి. థియేటర్స్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయినా.. ఓటీటీలో మాత్ర సూపర్ హిట్‌గా నిలుస్తున్నాయి. ఆ లిస్ట్‌లోకి ఇప్పుడు 23 మూవీ కూడా చేరింది. మల్లేశం'ఫేం రాజ్ రాచకొండ దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ డ్రామా మే 16న థియేటర్స్‌లో విడుదలై ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. ఇక రీసెంట్‌గా ఓటీటీలో విడుదలై మంచి వ్యూస్‌తో దూసుకెళ్తోంది. ఒకేసారి మూడు ఓటీటీల్లో ఈ చిత్రం ప్రీమియర్ అవుతోంది. అమెజాన్ ప్రైమ్‌తో పాటు ఆహా, ఈటీవీ విన్‌లోనూ ఈ చిత్రం స్ట్రీమింగ్ అవుతుంది. ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం ట్రెండింగ్‌లో ఉంది. అలాగే ఆహాలో ట్రెండింగ్ అవుతున్న టాప్ 10 సినిమాలో టాప్ 2 ప్లేస్‌లో ఈ చిత్రం ఉంది. 23 విషయానికొస్తే..1991లో చిలకలూరిపేటలో జరిగిన బస్సు దహనం సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. సాగర్(తేజ) ఓ పల్లెటూరిలో ఉంటాడు. లోన్ తీసుకుని ఇడ్లీ బండి పెట్టుకోవాలనేది కోరిక. కానీ అప్ప దొరకదు. పొగాకు కూలీ సుశీల(తన్మయి)ని ప్రేమిస్తుంటాడు. పెళ్లి కాకుండానే ఈమెకు ప్రెగ్నెన్సీ వస్తుంది. ఆమెని పెళ్లి చేసుకుని ప్రశాంతంగా జీవించాలంటే డబ్బు కావాలి. దీంతో తన ఫ్రెండ్ దాస్‌తో కలిసి బస్సు దోపిడీ చేయాలని అనుకుంటాడు. కానీ అది అమలు చేసే క్రమంలో ప్రయాణికులు తిరగబడతారు. అనుకోకుండా నిప్పంటుకుని 23 మంది సజీవ దహనం అయిపోతారు. తర్వాత ఏమైంది? కోర్టు ఏం తీర్పు ఇచ్చిందనేదే మిగతా స్టోరీ.

## దాదాసాహెబ్ బయోపిక్.. ఇదలాంటి సినిమా కాదు..



దివంగత ప్రముఖ దర్శక-నిర్మాత-స్క్రీన్ రైటర్ దాదాసాహెబ్ ఫాల్కే జీవిత చరిత్ర వెండితెరపైకి రానుంది. ఈ చిత్రంలో ఆమిర్ ఖాన్ టైటిల్ రోల్ చేయనున్నారు. ఆమిర్ ఖాన్‌తో 'త్రీ ఇడియట్స్, పీకే' వంటి హిట్ చిత్రాలు తెరకెక్కించిన రాజ్‌కుమార్ హిరాణి దర్శకత్వంలో ఈ దాదాసాహెబ్ బయోపిక్ రూపొందనుంది. తాజాగా ఈ సినిమా గురించి ఆమిర్ ఖాన్ మాట్లాడారు. ''దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ చేయడం అనేది పెద్ద చాలెంజ్. వాణిజ్యపరమైన అంశాలున్న సాధారణ సినిమా కాదు ఇది. ఆ రోజుల్లోనే ఎవరూ ఊహించలేని విధంగా అడ్వెంచర్ చేసిన వ్యక్తి కథ ఇది.

### అంత ఈజీ కాదు

ఆయన జీవితంలో ఎన్నో ఎగ్జైట్ చేసే అంశాలు, సంగతులు, సంఘటనలు ఉన్నాయి. అడ్వెంచర్ జర్నీలాంటి ఈ సినిమా చేయడం అంత సులభం కాదు. దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్ చేయడాన్ని నేను, రాజు (దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి కావొచ్చు) పెద్ద గౌరవంగా ఫీల్ అవుతున్నాం. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన్ చేశాం'' అని ఆమిర్ ఖాన్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ సమాచారం.



## గ్లామర్ ట్రీట్

నాని నటించిన జెర్సీ సినిమాతో టాలీవుడ్‌కు పరిచయం అయింది 'శ్రద్ధా శ్రీనాథ్'.. కొద్దిరోజుల క్రితం డాకు మహారాజ్ సినిమాలో కూడా ఆమె మెప్పించింది. అయితే, తాజాగా ఆమె షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. సిల్వర్ స్క్రీన్‌పై హోమ్లీగా కనిపించిన ఆమె బికినీ షోతో అభిమానులకు గ్లామర్ ట్రీట్ అందించింది. ఆమె బీర్ తాగుతూ ఉందంటూ గుర్తించిన కొందరు ఆ ఫోటోను హైలెట్ చేస్తున్నారు. శ్రద్ధా శ్రీనాథ్ రీసెంట్‌గా మాల్దీవ్స్ వెకేషన్‌లో ఎంజాయ్ చేసింది. అక్కడ బికినీలో దిగిన ఫొటోలను తన సోషల్‌మీడియాలో పంచుకుంది. సినిమాల్లో ఎంతో పద్ధతిగా కనిపించే శ్రద్ధా శ్రీనాథ్ ఇలా పబ్లిక్‌గా బీర్ తాగుతూ బికినీలో ఫోజులు ఇవ్వడంతో నెటిజన్లు అందరు ఆశ్చర్యపోతున్నారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడలో నటించిన ఈ బ్యూటీ త్వరలో హిందీ సినిమాలో నటించే ఛాన్స్ దక్కించుకుంది. అందుకే ఆమె ఇలాంటి గ్లామర్ ట్రీట్ ఇస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.




## మంచు విష్ణు కన్నప్ప..

### రెండు రోజుల్లో ఎన్ని కోట్లంటే?

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా థియేటర్లలోకి వచ్చిన కన్నప్ప బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. తొలి రోజే పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్లపరంగా రాణిస్తోంది. మొదటి రోజు రూ. 9.35 కోట్ల నికర వసూళ్లు సాధించింది. అయితే రెండో రోజు రూ.7 కోట్లకు పైగా రాబట్టినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రోజుల్లో కలిపి ఇండియా వ్యాప్తంగా రూ. 16.35 కోట్ల నెట్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు సమాచారం. కాగా.. ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటించారు. కాగా.. ఈ సినిమాకు బాలీవుడ్ డైరెక్టర్ ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే జోరు కొనసాగితే విష్ణు మంచు కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా కన్నప్ప నిలవనుంది. గతంలో మంచు విష్ణు చిత్రాలైన జిన్నా, మోసగాళ్లు సినిమాలకు చాలా తక్కువ వసూళ్లు వచ్చాయి. ఈ సినిమాలో ప్రభాస్ రుద్ర పాత్రలో మెప్పించగా.. మంచు విష్ణు తిన్నడు పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ కనిపించింది. అంతేకాకుండా మోహన్ బాబు, అర్పిత్ రంకా, బ్రహ్మానందం, బ్రహ్మాజీ, శివ బాలాజీ, కౌశల్ మంద, రాహుల్ మాధవ్, దేవరాజ్, ముఖేష్ రిషి, రఘు బాబు, మధు కీలక పాత్రల్లో నటించారు.

## సీక్రెట్స్ ఉంటే ఆ హీరోకే చెప్తా..



బ్యాడ్మింటన్ కోర్టు వదిలేసి, మోడలింగ్ ప్రపంచంలో నాజూకు అడుగులతో మొదలుపెట్టింది. నేడు వెండితెర మీద తనదైన సామ్రాజ్యం నిర్మించుకుంది నటి దీపికా పదుకొణే. ఇప్పుడు కాస్త గ్యాప్ తీసుకొని త్వరలో రాబోతుండటంతో, ఎక్కడ చూసినా ఆమె పేరే ఒక హాట్ టాపిక్! అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్‌లో రూపొందే సినిమాలో ఆమెను కథానాయికగా ఎంపిక చేయడం సినీ పరిశ్రమలో పెద్ద వార్తగా మారింది. ఆమె గురించి కొన్ని విషయాలు మీకోసం..

### బ్యాడ్మింటన్ ఆట నుంచి..

దీపికా పదుకొణె కొంకణి అమ్మాయి. ఆమె తండ్రి ప్రకాశ్ పదుకొణే భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. తండ్రి ప్రభావంతో బ్యాడ్మింటన్ ఆడిన దీపికా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొంది. కాని తనకు సినిమా, మోడలింగ్‌పై ఆసక్తి ఎక్కువగా ఉండటంతో నటన వైపు మొగ్గుచూపింది. ఆమె సినీ ప్రయాణం తెలుగు సినిమా 'మన్మథుడు' ఆధారంగా రూపొందిన కన్నడ రీమేక్ 'ఐశ్వర్య' చిత్రంతో మొదలైంది.

### తెలుగులో ఎప్పుడో యాక్ట్ చేసింది

తెలుగు దర్శకుడు జయంత్ సి. పరాన్జీ, దీపికాకు తెలుగులో మొదటి అవకాశం ఇచ్చారు. ఓ యువ ప్రేమకథలో ప్రత్యేక పాటలో నాట్యం చేసింది. ఆ సినిమా పూర్తయింది. కానీ, ఇప్పటికీ విడుదల కాలేదు. లేకపోతే ఆమె టాలీవుడ్‌లో ఎప్పుడో అడుగుపెట్టేది. 'కల్కి' సినిమాలో సుమతి పాత్రతో ఆకట్టుకున్న దీపికా, ఇప్పుడు మళ్లీ అల్లు అర్జున్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

### రహస్యాన్ని అతడికే చెప్తా

ఓ ఇంటర్వ్యూలో తల్లి అయ్యాక, తన పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్త వహిస్తున్నానని, బిడ్డకు సమయాన్ని ఇచ్చేలా ప్రయత్నిస్తున్నానని చెప్పింది. ఓ కార్యక్రమంలో 'ఒక రహస్యాన్ని చెవిలో చెప్పాలంటే ఏ హీరోకి చెబుతారు?' అన్న ప్రశ్నకు వెంటనే షారుఖ్ ఖాన్ అని బదులిచ్చింది. 2007లో రణ్‌బీర్ కపూర్‌తో పరిచయం, ప్రేమగా మారింది. ఒకే మేకప్ ఆర్టిస్ట్ కారణంగా ఫోన్ నంబర్లు మార్చుకుని ప్రేమలో పడ్డారు. తన మెడ వెనక అతడి పేరు టాటూ వేయించుకుంది. కాని, ఏడాదిలోనే బ్రేకప్ జరిగింది.

### డిప్రెషన్

రణ్‌బీర్ కపూర్ మరో అమ్మాయితో సంబంధం పెట్టుకోవడం వల్ల విడిపోయినట్లు ఓ సందర్భంలో దీపిక చెప్పింది. దీని వలన డిప్రెషన్‌కు లోనైనా, కెరీర్‌పై ప్రభావం రాకుండా చూసుకుంది. 'ఏ జవానీ హై దివానీ' సినిమా అదే సమయంలో పూర్తి చేసింది. ఇప్పుడు ఇద్దరూ ఎవరి జీవితాల్లో వాళ్లు బిజీ అయిపోయారు. దీపికా – రణ్‌వీర్ సింగ్‌ను పెళ్లి చేసుకుని ఒక పాపకు జన్మనిచ్చింది. మరోవైపు రణ్‌బీర్ కపూర్ – ఆలియా భట్‌ను వివాహం చేసుకుని పాపకు తండ్రయ్యాడు. ఇప్పటికీ వీరిద్దరూ ఒకరిని ఒకరు ప్రొఫెషనల్‌గానే పలకరించుకుంటారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com